ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 26.0

ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 29 ఏప్రిల్ 2025

రూ.62.03 లక్షల పంట నష్టం

మళ్లీ దెబ్బకొట్టిన గాలివాన



తాడిపత్రి మండలంలో కూలిపోయిన అరటి చెట్లు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం వరి, అరటి, బొప్పాయి తదితర పంటలను దెబ్బతీసింది. అనంతపురం రూరల్, తాడిపత్రి, గుమ్మఘట్ట, గుంతకల్లు మండలాల్లో 11.70 హెక్టార్లలో వరి పంట దెబ్బతినడంతో రూ.46.80 లక్షల పంటనష్టం జరిగింది. గార్లదిన్నె మండలంలో 38 మంది రైతులకు సంబంధించి 25 హెక్టార్లల్లో వరిపంట దెబ్బతినడంతో రూ.15.50 లక్షల పంటనష్టం జరిగింది. తాడిపత్రి మండలంలోని ఆలూరు, వెలమకూరు, బ్రాహ్మణపల్లి, వెంకటాంపల్లి, ఆవుల తిప్పాయపల్లి గ్రామాల్లో అరటి, బొప్పాయి పంటలు ధ్వంసమయ్యాయి. ఆత్మకూరులో రైతు పోతిరెడ్డి ఐదు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట నేలవాలింది. దీంతో రూ.3 లక్షలు నష్టం జరిగింది. జిల్లాలోని 21 మండలాలలో ఆదివారం వర్షం కురిసింది. అత్యధికంగా ఉరవకొండలో 49.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. రాయదుర్గం 38.6, రాప్తాడు 30, గుంతకల్లు 24.2, కూడేరు 22.4, యాడికి 19.4, ఆత్మకూరు 18, గార్లదిన్నె 13.8, పామిడి 6.4, పెద్దపప్పూరు 6.2, బుక్కరాయసముద్రం, శెట్టూరు 5.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 4.8 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.



గార్లదిన్నె: నేలకొరిగిన వరిపంట చూపుతున్న రైతు రవికుమార్

కూలి చేసినా.. ఖాళీ కడుపే..!



నాయనవారిపల్లి వద్ద ఎండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

శింగనమల/అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు మూడు నెలలుగా బిల్లులు అందలేదు. పనిచేసిన పదిరోజుల్లోపు వారానికి సంబంధించి బిల్లులను కూలీల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లావ్యాప్తంగా కూలి డబ్బులు రూ.45 కోట్లు, మెటీరియల్ వర్క్ కింద రూ.55 కోట్లు పెండింగ్ ఉంది. డ్వామాలో పనిచేస్తున్న ఉపాధి హామీ, వాటర్‌షెడ్ ఉద్యోగులకు కూడా మూడు నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో ఉద్యోగులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పండుగ రోజూ పనిచేసినట్లు..

శ్రీరామనవమి పండుగ రోజున, అందులోనూ ఆదివారం ఉపాధి పనులు చేసినట్లు మస్టర్లు నమోదు చేశారు. జిల్లాలో 22 మండలాల పరిధిలోని 90 గ్రామాలలో 451 పనులను పండుగ రోజు చేసినట్లు, 2,699 మంది ఉపాధి కూలీలు పాల్గొన్నట్లు చూపించారు. పాత పనుల వద్ద ఫొటోలు తీసి మాయ చేశారు. వెబ్‌సైట్‌ను పరిశీలిస్తే.. ఒకే ఫొటోను పలు పంచాయతీల్లో, నాలుగైదు మస్టర్లలో అప్‌లోడ్ చేసినట్లు స్పష్టంగా తేలింది. ఇలాంటి వ్యవహారాలను అధికారులు పట్టించుకోవడం లేదు. అందుకే బోగస్ మస్టర్ల నమోదులో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉందని విమర్శలు వస్తున్నాయి.

పేరుకుపోయిన బకాయిలు

- ఉపాధి పథకం కింద రూ.45 కోట్ల కూలీల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో రూ.55 కోట్లు మెటీరియల్ బకాయిలు ఉన్నాయి. మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు.. ఉపాధి కూలీల వేతనాల కంటే తక్కువగా ఉండాలి. ఆర్థిక సంవత్సరం ఆఖరు కావడంతో ఫిబ్రవరి, మార్చి నెలల్లో మెటీరియల్ వర్క్ ఎక్కువగా చేశారు. దీంతో ఉపాధి కూలీల వేతనాల కంటే మెటీరియల్ బిల్లులు ఎక్కువగా కనిపిస్తున్నాయి.
- డ్వామా ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు అందలేదు. ఉపాధి పథకం కింద ఏపీడీలు, ఏపీఓలు, టీఏ, ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వాటర్‌షెడ్‌లో ఏపీడీ, పీఓ, ఇంజనీర్లు, టీఓ, ఫీల్డ్ సిబ్బంది ఉన్నారు. ఇలా డ్వామాలో వెయ్యి మందికిపైగా పనిచేస్తున్నారు. ఫిబ్రవరి నుంచి జీతాలు పడలేదని వారు వాపోతున్నారు.

పనులకు వెళ్లడం లేదు..

కూలి డబ్బులు అందని కారణంగా చాలా మంది పనులకు వెళ్లడం లేదు. శింగనమల మండలంలో 10,973 జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రతి సంవత్సరం పనులకు వెళ్లే కూలీలు 15 వేలకు పైగానే ఉన్నారు. ఏప్రిల్ నెలలో 8వేల మందికి పైగా పనులకు వెళ్లే వారు. ప్రస్తుతం రెండు వేల వరకు కూలీలు పనులకు వెళుతున్నారు. ఉపాధి పనుల్లో మెటీరియల్ బిల్లులు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలో 108 గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. నాలుగు షెడ్లకు మాత్రమే బిల్లులు మంజూరయ్యాయి. ఇంకా 104 గోకులంషెడ్లకు రూ.1.97 కోట్లు పెండింగులో ఉన్నాయి. డ్రైల్యాండ్ హార్టికల్చర్ స్కీమ్ కింద రూ.95 లక్షలు బిల్లులు రావాల్సి ఉంది.

కనిపించని సౌకర్యాలు



బిల్లులు మంజూరు కాని గోకులం షెడ్

శింగనమల మండలంలో ఎండలు మండుతున్నా పని ప్రదేశాల్లో అధికారులు సౌకర్యాలు కల్పించడంలేదు. దీంతో పనులకు వెళ్లిన కూలీలు కూడా వెనుతిరుగుతున్నారు. పని సమయంలో 35 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో పనులు చేసేందుకు కూలీలు ఆసక్తి చూపడంలేదు. క్రమంగా కూలీల సంఖ్య తగ్గుతోంది. ఏప్రిల్ నెలలో కూలీల సంఖ్య పెరగాల్సింది పోయి తగ్గుతోంది.

సిబ్బందికి టార్గెట్ తిప్పలు

కూలీల శాతం తగ్గుతుండడంతో ఉపాధి హామీ పథకం సిబ్బందికి తిప్పలు తప్పడంలేదు. ఉన్నతాధికారులు టార్గెట్లు ఇస్తూ.. ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని, క్షేత్రస్థాయిలో సాంకేతిక క్షేత్ర సహాయకులు వెళ్లి అవగాహన కల్పించాలని ఆదేశిస్తున్నారు. వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా అనుకున్న లక్ష్యాలను పూర్తి చేయలేకపోతున్నారు. కూలీల సంఖ్య తగ్గడానికి వేతనాలు ఇవ్వకపోవడమే ప్రధాన కారణమని ఉన్నతధికారులకు తెలిసినా.. తమపై ఒత్తిళ్లు తెస్తుండడంతో సిబ్బంది దిక్కుతోచని స్థితిలో సతమతమవుతున్నారు.

త్వరలోనే జమ..

ఉపాధి కూలీల బకాయిల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కనీస వేతనం అందేలా పనులు చేయించి, కొలతలు వేయాలని సిబ్బందికి సూచించాం. బోగస్ మస్టర్లకు అవకాశం లేకుండా హాజరు నమోదు చేయాలని ఆదేశించాము. పెండింగ్ వేతనాలు త్వరలోనే జమవుతాయి.

\- సలీంబాషా, డ్వామా పీడీ

వారంలోపు జమ చేస్తాం

కూలీలకు బిల్లుల బకాయిలు ఉన్నది వాస్తవమే. ఆరు వారాల బిల్లులు కూలీలకు జమ కావాలి. గత రెండు రోజుల నుంచి మూడు వారాల బిల్లులు జమ అవుతున్నట్లు తెలిసింది. మిగిలిన బిల్లులు కూడా వెంటనే జమ అవుతాయి. గోకులం షెడ్లకు చెందిన మెటీరియల్ బిల్లులు రాలేదు. ఈ బిల్లులు కూడా ఈనెలాఖరులోపు విడుదలవుతాయి. కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కూలీలకు అవగాహన కల్పించి వచ్చే వారం నుంచి సంఖ్య పెంచుతాం.

\-తలారి దామోదర్, ఇన్‌చార్జ్ ఏపీఓ

అప్పులు చేసి షెడ్డు నిర్మించా..



పాడి ఆవుల సంరక్షణ కోసం అప్పులు చేసి గోకులం షెడ్డు నిర్మించా. ఉపాధి పథకం కింద వెంటనే బిల్లులు మంజూరవుతాయని అప్పట్లో అధికారులు ఒత్తిడి చేయడంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద వడ్డీకి తెచ్చి షెడ్డు పూర్తి చేశా. నాలుగు నెలలు గడుస్తున్నా నయా పైసా బిల్లులు పడలేదు. వడ్డీలు కట్టడానికి ఇబ్బంది పడుతున్నా. అధికారులు స్పందించి వెంటనే షెడ్డు బిల్లులు చెల్లించాలి. ఇలాగైతే రైతులు ఎవరూ ముందుకురారు.

\- దాల్ రమేష్, రైతు, సోదనపల్లి

కుటుంబ పోషణ బరువు



కాయకష్టం చేసినా డబ్బులు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోంది. ఆరు వారాలు దూర ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పనులు చేశాం. ఆటో బాడుగ వారానికి ఒక్కొక్కరు రూ.300 చెల్లించాం. అప్పులు చేసి ఆటోబాడుగ ఇచ్చాం. ఇంత వరకు వేతనాలు జమ కాలేదు. ఇతరుల దగ్గర అప్పులు చేయాల్సి వస్తోంది. మా ఇబ్బందులను తెలుసుకుని వెంటనే బిల్లులు చెల్లించాలి.

\- ఎర్రిస్వామి, ఉపాధికూలీ, శింగనమల

ఏడీసీసీబీ చైర్మన్‌గా ముంటిమడుగు

డీసీఎంఎస్ చైర్మన్‌గా నెట్టెం వెంకటేష్ 7



ఉమ్మడి జిల్లాకు సమన్యాయం



ట్రాఫిక్ పోలీసులకు సేఫ్టీ కిట్ల పంపిణీ



సేఫ్టీ కిట్లను పంపిణీ చేస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం ట్రాఫిక్ పోలీసులకు వేసవి నేపథ్యంలో ఎస్పీ జగదీష్ చేతులమీదుగా సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం సుమారు 100మందికి కూలింగ్ గ్లాసెస్, లీటర్ వాటర్ బాటిల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, క్యాప్ తదితర వస్తువులున్న కిట్లను ఎస్పీ అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మండుటెండల్లో ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బంది సంక్షేమం కూడా ముఖ్యమని, వడదెబ్బ బారిన పడకుండా ఇవి ఉపయోగపడతాయన్నారు. అనంతరం వాటిని అందజేయడంలో సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేసి, సన్మానించారు. కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, దాతలు పాల్గొన్నారు.

రాజధానిని ఏం గతి పట్టించారో మర్చిపోయావా?

భవిష్యత్తు అవసరాల మేరకే నిర్మాణాలు

మాజీ ఎమ్మెల్యే అనంతపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఫైర్



అనంతపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'రాజధానిని వైసీపీ హయాంలో ఏం గతి పట్టించారో మర్చిపోయావా' అంటూ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మండిపడ్డారు. ఆయన సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో నిర్వీర్యమైన రాజధానిని పూర్తిస్థాయిలో కట్టడానికే స్థల సేకరణ చేస్తున్నామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని, నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. గతంలో అమరావతి నిర్మాణ విషయంలో లేనిపోని ఆరోపణలు చేశారన్నారు. వైసీపీ హయాంలో ఒక ఇంచు పనులైనా చేశారా అని ప్రశ్నించారు. రాజధాని ప్రాంతంలో వైసీపీ అక్రమాలను ప్రజలు కళ్లారా చూశారన్నారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. రాజధాని నిర్మాణం కోసం గతంలో... ఇప్పుడు భూములిచ్చేందుకు ప్రజలు ముందుకొస్తుండటాన్ని చూసి ఓర్వలేక రియల్ వ్యాపారం అంటూ వైసీపీ నేతలు గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు. పోలవరం గురించి వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. అయినా.. మాట్లాడుతుండటం సిగ్గుచేటన్నారు. వైసీపీ పాలనలో సాగిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రం ఇంకా కోలుకోలేదన్నారు. కొత్త ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపడుతూనే.. సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెడుతోందని ఆయన వివరించారు.


కూటమి పాలనలో మత్స్యకారులకు మహర్దశ

ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో మత్స్యకారులకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో హామీ మేరకు వేట నిషేధ సమయంలో రూ.20వేలు సాయం అందజేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తద్వారా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూర్చారన్నారు. మత్స్యకారులకు పింఛన్లు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వేటలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తుస్తూ ఆ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారన్నారు.

కోటలోని మొనగాడు

తెలంగాణ సీఎస్‌గా గుత్తివాసి రామకృష్ణారావు



6

అర్ధరాత్రి హైడ్రామా

- చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య ప్రదేశంపై సర్వే
- ఆర్డీఓల సమక్షంలో అనంతపురం, కర్నూలు జిల్లా సరిహద్దుల కొలత
- కర్నూలు జిల్లా పరిధి అని నిర్ధారణ
- హత్య కేసు గుంతకల్లు రూరల్ స్టేషన్ నుంచి చిప్పగిరికి బదలాయింపు



ఆదివారం అర్ధరాత్రి రోవర్‌తో హత్యా స్థలాన్ని నిర్ధారిస్తున్న రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు

గుంతకల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా చిప్పగిరికి చెందిన లక్ష్మీనారాయణ హత్య కేసులో హైడ్రామా సాగింది. హత్య జరిగిన ప్రదేశం గుంతకల్లు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిగా భావించి ఇక్కడి పోలీసులు కేసుపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆ ప్రదేశం విషయంగా సందేహాలుండటంతో ఆదివారం రాత్రి సర్వే చేపట్టారు. అర్ధరాత్రిదాకా గుంతకల్లు, పత్తికొండ రెవెన్యూ డివిజనల్ అధికారులు, కర్నూలు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే, రెండు జిల్లాల సర్వే అధికారులు, తహసీల్దార్లు, గుంతకల్లు డీఎస్పీ, సీఐలు సర్వేలో పాల్గొన్నారు. రోవర్ ద్వారా మ్యాప్ సర్వే చేపట్టి ఆ ప్రదేశం చిప్పగిరి పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందని అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో తేల్చారు. ఈ మేరకు అధికారికంగా రిపోర్టును విడుదల చేశారు. దాంతో కేసు నమోదు, విచారణ విషయంగా ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది.

కేసు గుంతకల్లుకే ఇవ్వాలి

హత్య జరిగిన ప్రదేశం చిప్పగిరి పోలీసు స్టేషన్ పరిధిలోకి మారడంపై బాధితవర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. కేసు గుంతకల్లులోనేనే నమోదు చేయాలని, అప్పుడే తమకు న్యాయం చేకూరుతుందంటూ లక్ష్మీనారాయణ కుటుంబం, బంధువులు, సంబంధీకులు డిమాండ్ చేశారు. చిప్పగిరి స్టేషన్‌లో విచారణ జరిగితే తమకు న్యాయం జరగదని సందేహాలను వ్యక్తంచేశారు. పోలీసులు సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను బాధిత వర్గానికి వివరించారు. జ్యూరీడిక్షన్ ప్రకారమే కేసును నమోదు చేయాల్సి ఉంటుందనీ, విచారణ, కేసు నమోదు సులభతరం అవుతుందని తెలియజేశారు. ఓ పోలీసు అధికారి కారణంగా తమకు అన్యాయం జరిగిందనీ, ఆయన ఆధ్వర్యంలో విచారణ పారదర్శకంగా సాగుతుందన్న నమ్మకం లేదన్నారు. ఉన్నతాధికారితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఆ మేరకే విచారణ చేస్తామని హామీ ఇవ్వడంతో బాధిత వర్గం సమాధానపడింది.

నలుగురిపై కేసు

చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య ఘటనలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న ఆయన కుమారుడు వినోద్‌కుమార్ నుంచి చిప్పగిరి పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. చిప్పగిరికి చెందిన వైకుంఠం శివ ప్రసాద్, వైకుంఠం మల్లికార్జున చౌదరి, కొండా రామాంజనేయులు, అరికెర మల్లికార్జునను నిందితులుగా పేర్కొంటూ వినోద్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన టిప్పరు డ్రైవర్‌ను చిప్పగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. టిప్పర్ యజమాని, డ్రైవర్‌ను విచారించడం ద్వారా కేసును రెండు, మూడు రోజుల్లోనే పరిష్కరించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. చిప్పగిరి లక్ష్మీనారాయణ గుంతకల్లులో చేసిన పంచాయితీల విషయంగా కూడా కొందరిని పోలీసులు అనుమానిస్తున్నట్లు సమాచారం. వారిని అదుపులోకి తీసుకుని విచారించే అవకాశాలున్నట్లు తెలిసింది. విచారణ అనంతరం ఇది ఫ్యాక్షన్ హత్యా, పంచాయితీల నేపథ్యంలో ఏర్పడిన శత్రుత్వాల వల్ల జరిగిందా అనేది త్వరలో తేలనుంది. గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం లక్ష్మీనారాయణ మృతదేహాన్ని ఉదయం 11 గంటల ప్రాంతంలో చిప్పగిరికి తరలించారు. చిప్పగిరికి వచ్చిన ఎమ్మార్పీఎస్ (ప్రకాశ్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు.. పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విచారణను నిష్పాక్షికంగా చేపట్టాలని డిమాండ్ చేశారు.

లోకానికి సెలవు..!

క్వారీ గుంతలో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి

వేసవి సెలవుల్లో బంధువుల ఇంటికి వచ్చి..



దర్శిని (ఫైల్)



జయంతి (ఫైల్)



చిన్నారుల మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

వేసవి సెలవుల్లో బంధువుల ఇంట ఆనందంగా గడిపేందుకు వచ్చిన తోబుట్టువుల కూతుళ్లు ఇద్దరు నీట మునిగి ఈ లోకాన్ని వీడి వెళ్లిపోయారు. శెట్టూరు మండలం యాటకల్లు గ్రామంలో సోమవారం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. యాటకల్లు-గొల్లపల్లి మధ్యలో క్వారీ గుంతలో మునిగి దర్శిని (6), జయంతి (14) మృతిచెందారు. కళ్యాణదుర్గం మండల చాపిరి గ్రామానికి చెందిన నాగమణి, మల్లికార్జున దంపతుల కూతురు దర్శిని ఎల్‌కేజీ చదువుతోంది. ఇదే మండలంలోని గోళ్ల గ్రామానికి చెందిన కవిత, ధనుంజయ దంపతుల కూతురు జయంతి ఇటీవలే పదో తరగతి పాసైంది. వీరిద్దరూ అక్కచెల్లెళ్ల కూతుళ్లు. వేసవి సెలవులు కావడంతో యాటకల్లులోని సమీప బంధువుల ఇంటికి తల్లిదండ్రులతో కలిసి రెండు రోజుల క్రితం వచ్చారు. దర్శిని తల్లి నాగమణి బట్టలు ఉతికేందుకు సోమవారం ఉదయం క్వారీ వద్దకు వెళ్లారు. క్వారీలో ఉన్న భారీ నీటి గుంతలో బట్టలు ఉతికిన అనంతరం అరవేయడానికి నాగమణి పక్కకు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి పిల్లలిద్దరూ నీటిలో మునుగుతూ కనిపించారు. తనకు ఈత రాకపోవడంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల ఉన్నవారు చిన్నారులను బయటకు తీసేలాగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు చిన్నారుల మృతదేహాలపై పడి బోరున విలపించారు. శెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నీటికుంటల వద్ద ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నా.. ఏమరుపాటుగా ఉండటంతో పునరావృతవుతున్నాయి.

\-ఆంధ్రజ్యోతి, శెట్టూరు

పైసలకొద్దీ.. పర్సెంటేజీ..!

పాయింట్ల కోసం టీచర్ల అడ్డదారులు 6

ఆర్డీటీకి అండగా నిలుద్దాం..

ఉమ్మడి అనంత, ఇతర జిల్లాల్లోనూ కార్యకలాపాలు

ప్రభుత్వాలకు మించి మౌలిక, విద్య, వైద్యరంగాల్లో సేవలు
రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీని కాపాడుకుందాం: వక్తలు 7

వేతన పోరు..!

- తాగునీటి కార్మికుల వేతన వెతలు
- 24 రోజులుగా కొనసాగుతున్న సమ్మె
- పట్టించుకోని అధికారులు

ఎస్ఈ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు (ఫైల్)



అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేతనం అందాలంటే సమ్మె చేయాల్సిందే అన్న చందంగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల పరిస్థితి తయారైంది. ఐదు నెలలుగా వేతనాలు అందట్లేదు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ లెక్కలేని తనంతో కార్మికులకు తిప్పలు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలోని ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం, పెనుకొండ మండలాల్లోని 727 గ్రామాలకు పీఏబీఆర్ నుంచి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ఈ పథకంలో 588 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి 5 నెలల వేతనాలు పెండింగ్ ఉండటంతోపాటు ఈపీఎఫ్ జమ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో పలుమార్లు కార్మికులు సమ్మెబాట పట్టినా అధికారులు కంటి తుడుపు చర్యలతో సరిపెడుతున్నారు. ఒకట్రెండు నెలల వేతనం జమ చేసి, సమ్మె విరమించేలా చేస్తూ వస్తున్నారు. కార్మికులు ప్రస్తుతం తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో నీరు సరఫరాకాక అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రస్తుతానికి స్థానికంగా ఉన్న వనరుల నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. ఇకపై ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులకు సంబంధించి టెండరు గడువు ముగియడంతో వేతనాల చెల్లింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాత కాంట్రాక్టర్ ద్వారా చెల్లిద్దామన్నా.. నిధుల కొరత ఉంది. టెండరు పూర్తి చేసి బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

-సురేష్, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

కోటలోని మొనగాడు..!

తెలంగాణ సీఎస్‌గా గుత్తివాసి రామకృష్ణారావు

- తాత చంద్రమౌళీశ్వర రావు స్వాతంత్ర్య సమరయోధుడు
- తండ్రి రైల్వే ఉద్యోగి.. హైదరాబాద్‌లో స్థిరపడిన కుటుంబం



తెలంగాణ సీఎం అభినందనలు



రామకృష్ణారావు కుటుంబం నివసించిన ఇల్లు ఇక్కడే ఉండేది.. కొన్నవారు ఇలా పునర్నిర్మించారు

గుత్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గుత్తి కోట వీధిలో ఒకప్పుడు ఓనమాలు దిద్దిన కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. వీరిది స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం. గుత్తి పట్టణంలోని కోట ప్రాంతంలో వీరి కుటుంబం ఉండేది. రామకృష్ణారావు తాత(తండ్రికి తండ్రి) కూట్లిగి చంద్రమౌళీశ్వర రావు స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తల్లిదండ్రులు గురునాథరావు, భాగ్యలక్ష్మి దంపతులు. గురునాథరావు రైల్వే ఉద్యోగి కావడంతో బదిలీలపై వేర్వేరు ప్రాంతాలకు వెళ్లారు. చివరకు హైదరాబాదులో స్థిరపడ్డారు.

గుత్తి నుంచే ప్రస్థానం..

రామకృష్ణారావు గుత్తి కోట వీధిలోని పట్టు కేశవపిళ్లై ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదివారు. శ్రీసత్యసాయి జిల్లా (ఉమ్మడి అనంతపురం జిల్లా) పరిగి మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివారు. నాగార్జున సాగర్‌లో ఇంటర్, కాన్పూర్ ఐఐటీలో బీటెక్, ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్, డ్యూక్ యూనివర్శిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. 1991లో ఐఏఎస్ సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నల్గొండ, మహబూబ్‌నగర్, నిజామబాద్ జిల్లాల సబ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు, అదిలాబాద్ జిల్లాల కలెక్టర్‌గా, విద్యాశాఖ కమిషనర్‌గా, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహించారు.



గుత్తిలో స్నేహితులతో రామకృష్ణారావు దంపతులు (ఫైల్)

జ్ఞాపకాలే మిగిలాయి..

గుత్తి కోట వీధిలో రామకృష్ణారావు కుటుంబానికి సొంత ఇల్లు ఉండేది. ఇదే మండలంలోని కొత్తపేట గ్రామ పరిధిలో భూములు ఉండేవి. ఇంటిని అమ్మేశారు. భూములను కూడా విక్రయించారని తెలిసింది. ప్రస్తుతం ఇక్కడ వారికి బంధువులు ఎవరూ లేరు. ప్రాథమిక పాఠశాలలో కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు నాగరాజు, సికిందర్ తదితరులు ఉన్నారు. 2014లో కుటుంబ సమేతంగా రామకృష్ణారావు గుత్తికి వచ్చారు. తాను చదువుకున్న పాఠశాలకు వెళ్లి ఆనందంగా గడిపారు. స్నేహితులను కలిశారు. ఆ తరువాత గుత్తికి మరోమారు రాలేదని ఆయన స్నేహితులు తెలిపారు.



గుత్తి కోటవీధిలో రామకృష్ణారావు చదువుకున్న పాఠశాల

గర్వంగా ఉంది..



నా చిన్ననాటి స్నేహితుడు తెలంగాణ సీఎస్ కావడం గర్వంగా ఉంది. మేము ఐదో తరగతి వరకూ కలిసి చదువుకున్నాం. చిన్నప్పుడే విడిపోయినా స్నేహాన్ని కొనసాగిస్తున్నాం.

-నాగరాజు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం జిల్లా సహకార శాఖ అధికారి

ఆనందంగా ఉంది..



నా చిన్ననాటి స్నేహితుడు తెలంగాణ రాష్ట్రానికి సీఎస్ కావడం ఆనందంగా ఉంది. ఆయన కుటుంబసమేతంగా గుత్తికి వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చారు. మేము చదువుకున్న పాఠశాలకు వెళ్లి ఆనందంగా గడిపాము. చిన్ననాటి జ్ఞాపకాలను నేమరువేసుకున్నాము. - సిఖందర్, స్నేహితుడు

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రామమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, టర్నర్, మెషినిస్ట్, మోటార్ మెకానిక్, కోపా తదితర కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మే 24వ తేదీలోపు https://iti.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ పరీక్షల ఫలితాలను సోమవారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి విడుదల చేశారు. ఏప్రిల్‌లో నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామన్నారు. వాటి ఫలితాల కోసం కళాశాలలోని అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డీసీఈలు ప్రొఫెసర్ మాధవి, డాక్టర్ లలితకుమారి, విభాగాధిపతులు కళ్యాణిరాధ, మమత, అజిత, జరీనా, నారాయణరెడ్డి, రామశేఖర్ రెడ్డి, కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపే పాలిసెట్

37 కేంద్రాలు.. 14,205 మంది విద్యార్థులు..

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం పాలిసెట్-2025 నిర్వహించనున్నారు. ఇందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 14,205 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పాలిసెట్ నిర్వాహక కన్వీనర్లు జయచంద్రారెడ్డి, సురేష్‌బాబు తెలిపారు. అనంతపురంలో 9, తాడిపత్రిలో 6, గుంతకల్లులో 4, కళ్యాణదుర్గంలో 3, కదిరి, ధర్మవరం, హిందూపురంలో 5 చొప్పున మొత్తం ఉమ్మడి జిల్లాలో 37 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 11 గంటలకు పరీక్షలు ప్రారంభమౌతాయనీ, గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. హాల్‌టిక్కెట్ రానివారు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

బీఈడీ పరీక్షల్లో నలుగురు డిబార్

పలు తేదీల్లో పరీక్షలు వాయిదా

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఈడీ పరీక్షల్లో సోమవారం నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. పరీక్షా కేంద్రాలను తనఖీ చేసి, మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న వారిని డిబార్ చేశామన్నారు. ఈనెల 29, 30 తేదీల్లో, మే 7న నిర్వహించాల్సిన పరీక్షలను వాయిదా వేశామన్నారు. పాలిసెట్, ఐసెట్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వీటిని జూన్ 2, 3, 4 తేదీల్లో తిరిగి నిర్వహిస్తామనీ, విద్యార్థులు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

ఆశాజనకంగా మార్కెట్ ఫీజు వసూళ్లు

మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ చౌదరి

ఇంటర్వ్యూ



అనంతపురంరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డుల్లో ఫీజు వసూళ్లు ఆశాజనకంగా ఉందని జిల్లా మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ చౌదరి పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 96.75 శాతం మార్కెట్ ఫీజు వసూళ్ల రాబట్టినట్లు తెలిపారు. లక్ష్యాలు, వసూళ్ల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: గత ఆర్థిక సంవత్సరం మార్కెట్ ఫీజు లక్ష్యమెంత..? ఎంత వసూలైంది..?

ఏడీ: 2024-25 ఆర్థిక సంవత్సరం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ జిల్లాకు రూ.12.06 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. రూ.11.66 కోట్లు వసూళ్ల రాబట్టి.. 96.75 శాతం నమోదు చేశాం. అంతకు ముందు ఏడాదితో పోల్చితే..రూ.35లక్షలు ఎక్కువగానే వసూళ్లు చేశాం.

ఆంధ్రజ్యోతి: వందశాతం పూర్తి చేసిన మార్కెట్ కమిటీలు ఉన్నాయా..?

ఏడీ: జిల్లాలోని తొమ్మిది మార్కెట్ యార్డుల్లో.. ఐదు కమిటీలు వంద శాతం లక్ష్యాలను పూర్తి చేశాయి. రాయదుర్గం మొదటి స్థానంలో ఉంది. రూ.1.44 కోట్లకు గాను.. రూ.1.61 కోట్లు వసూలు చేశారు. కళ్యాణదుర్గం రూ.61 లక్షలకు గాను రూ.64.16లక్షలు, శింగనమల రూ.1.02కోట్లకు.. రూ.1.05 కోట్లు, తాడిపత్రి రూ.2.02 కోట్లకు రూ.2.08 కోట్లు, గుంతకల్లు రూ.65 లక్షలకు రూ.66.04 లక్షలు వసూలయింది. అనంతపురం రూ.4.60 కోట్లకు.. రూ.4.34 కోట్లు వసూలు చేశాం.

ఆంధ్రజ్యోతి: వంద శాతం ఫీజు వసూలు కాకపోవడానికి కారణాలేమిటి..?

ఏడీ: గత ఆర్థిక సంవత్సరం అకాల వర్షాలతో పంట దిగుబడులు బాగా తగ్గిపోయాయి. ఎండు మిర్చి ధరలు పూర్తిగా పడిపోయాయి. దీంతో కొనుగోలు తగ్గిపోయాయి. కంది, వరి తదితర పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసింది. వేరుశనగ దిగుబడలు తగ్గాయి. వీటి ప్రభావం ఫీజు వసూళ్లపై పడింది.

ఆంధ్రజ్యోతి: ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను నిర్దేశించారా.. ఒక్కో కమిటీకి ఎంత..?

ఏడీ: ఇటీవల మార్కెటింగ్ శాఖ బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. ఇందులో జిల్లాకు రూ.13.49 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించారు. అనంతపురం మార్కెట్ కమిటీకి రూ.5.10 కోట్లు, గుత్తికి రూ.25 లక్షలు, గుంతకల్లు రూ.73 లక్షలు, కళ్యాణదుర్గం రూ.70 లక్షలు, రాప్తాడు రూ.50 లక్షలు, రాయదుర్గం రూ.1.76 కోట్లు, శింగనమల రూ.1.20 కోట్లు, తాడిపత్రి రూ.2.35 కోట్లు, ఉరవకొండకు రూ.90 లక్షలు మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాలను ఇచ్చారు.

అటవీశాఖలో నోటీసుల కలకలం..!

చలానా సొమ్ము స్వాహాపై రికవరీకి ఆదేశాలు

- ఉద్యోగ విరమణ వేళ.. నోడ్యూస్ తిరకాసు
- తప్పుచేసిన వారితోనే నివేదిక తయారీ
- ప్రస్తుత సూపరింటెండెంట్‌కూ భాగస్వామ్యం
- ఇదెక్కడి న్యాయమంటూ సిబ్బంది గగ్గోలు



అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీచేయడంతో కలకలం రేగుతోంది. శని, ఆదివారాల్లో పలువురికి షోకాజ్ నోటీసులు పంపడంతో ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. అనంతపురం రేంజ్‌కు సంబంధించి నకిలీ చలనాల రూపంలో దారి మళ్లిన సొమ్మును రికవరీ చేయడంలో అధికారులు వింతధోరణి అవలంబిస్తున్నారు. అక్రమార్కుడు అనంతపురం రేంజ్‌కే పరిమితం కాకుండా.. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ పని చేస్తే అక్కడ నకిలీ చలనాల రూపంలో ప్రభుత్వ ఖజానాకు వెళ్లాల్సిన సొమ్మును దారి మళ్లించి జేబు నింపుకున్నాడని తెలుస్తోంది. ఎక్కడెక్కడ ఎంత నొక్కేశాడనేది బీట్‌ల వారిగా లెక్కలు తేల్చారు. సంబంధిత సిబ్బంది ద్వారా రికవరీ చేసేందుకు యంత్రాంగం చర్యలకు సిద్ధమయింది. అందుకు అనుగుణంగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇదంతా చేస్తున్నది అందులో భాగస్వాములైన అప్పటి అకౌంటెంట్ కావడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. అక్రమాలు జరిగిన సమయంలో కొన్ని రోజులు సూపరింటెండెంట్లుగా రవికుమార్, షాహనవాజ్ ఉన్నారు. పని ఒత్తిడి కారణంగా అప్పట్లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న రమేష్‌కు అకౌంట్స్ విభాగం బాధ్యతలు అప్పగించినట్లు వెలుగులోకి వచ్చింది. ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు ఎలాంటి రికార్డులు చూపకపోవడంతో.. బాధ్యుడు రమేష్ అయినా రికార్డుల ప్రకారం ఉన్నవారిపై చర్యలకు శ్రీకారం చుట్టారు.

ఉద్యోగ విరమణ వేళ.. నోడ్యూస్ తిరకాసు

అక్రమాల్లో భాగస్వాములయిన ఉద్యోగ విరమణ పొందే వారికి నోడ్యూస్ ఇవ్వకుండా ఆదేశాలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. ఇందులో ప్రధానంగా ఐజాక్‌బాబు ముదిగుబ్బ ఎఫ్ఎస్‌ఓగా ఉన్నారు. ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయన ఎఫ్ఎస్‌ఓగా గుత్తిరేంజ్‌లో పని చేసిన సమయంలో బీట్ ఆఫీసర్ అయూబ్ బాషాకు సంబంధించిన చలానాలు సైతం నకిలీలుగా తేలాయి. ఇప్పటికే అయూబ్ బాషా మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం ఇచ్చారు. ఎఫ్ఎస్‌ఓ ఐజాక్‌బాబు ఉద్యోగ విరమణ సమయంలో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పట్లో ఆత్మకూరు సెక్షన్ ఆఫీసర్‌గా ఉండి.. ప్రస్తుతం కుప్పం డీఆర్వోగా ఉన్న పుల్లయ్య, ప్రస్తుతం అనంతపురం రేంజర్‌గా ఉన్న శ్రీనివాసులు జూన్ నెలలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. వీరికి కూడా నోడ్యూస్ ఇవ్వడానికి అడ్డంకిగా మారింది. డీఆర్వోగా వెళ్లిన రామకోటి అప్పుడు జరిగిన అక్రమాల్లో తమ పాత్ర ఏమీ లేనప్పటికి బాధ్యత వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగస్టులో ఉద్యోగ విరమణ పొందనున్న అప్పటి రేంజర్‌గా ఉన్న సూర్యచంద్రరాజు ప్రస్తుతం జోన్ సబ్ డీఎఫ్‌ఓగా ఉన్నారు. ధర్మవరం డీఆర్వోగా ఉండి శ్రీశైలానికి రేంజర్‌గా బదిలీ అయిన రామకోటికి నోడ్యూస్ సమస్యలు తప్పేలా లేవు.

మొద్దు నిద్రలో అకౌంట్స్ విభాగం

ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటుంటే.. అకౌంట్స్ విభాగం ఏమి చేస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో ప్రస్తుత సూపరింటెండెంట్ గా ఉన్న అప్పటి సీనియర్ అసిస్టెంట్ ఇన్‌చార్జ్‌గా అకౌంట్స్ విభాగం బాధ్యతలు నిర్వహించారు. అకౌంట్స్ విభాగంలో మరో కాంట్రాక్ట్ వర్కర్ కీలకం కావడంతో తప్పిదాలు వెలుగులోకి వచ్చినప్పటికి తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు సమాచారం. 2019 నుంచి 2023 వరకు ఈ తంతు జరుగుతున్నా ఏ ఒక్కటీ బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారంటే ఈ కార్యాలయంలో కాంట్రాక్ట్ వర్కర్ల హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. జిల్లా అధికారి వద్దకు పంపే ముందు అకౌంట్స్ అధికారి, సూపరింటెండెంట్ పరిశీలిస్తారు. అసలు వీరు ఏమి చేశారన్నది ప్రశ్నార్థకరంగా మారింది. అనంతపురం రేంజ్‌లో ఏకంగా 173 నకిలీ చలానాలతో రూ.11,72,158, గుత్తిలో 34 నకిలీ చలానాలతో రూ.2,73,225 సొమ్ము పక్కదారి పట్టినట్లు సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

రెగ్యులర్ సిబ్బందిపైనే ఒత్తిడి

ఉమ్మడి జిల్లాలో నకిలీ చలానాల రూపంలో కాంట్రాక్ట్ కార్మికుడి చేతిలో మోసపోయిన సిబ్బంది పరిస్థితి ఇటు నుయ్యి, అటు గొయ్యి అన్న చందంగా మారింది. అధికారుల తీరు చూస్తుంటే.. ప్రస్తుతం ఉన్న రెగ్యులర్ సిబ్బందిపైనే ఒత్తిడి తెచ్చి రికవరీకి చర్యలు చేపట్టేలా నోటీసులు జారీ చేశారు. అసలైన అక్రమార్కుడి నుంచి రికవరీకి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. పోలీసుల నుంచి నిందితుడి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన వివరాలు సైతం తెప్పించారు. అందులో కూడా అక్రమాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది.

రికవరీ చేస్తే తప్పు ఒప్పుకున్నట్లే...

ఉమ్మడి జిల్లాలోని 10 మంది రేంజర్లకు, శ్రీసత్యసాయి జిల్లాలోని 11 మంది సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు, గుత్తి రేంజ్‌లోని 12 మంది సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు, అనంతపురం రేంజ్‌లోని ఒక సెక్షన్ ఆఫీసర్‌తోపాటు ఐదుగురు ఎఫ్‌బీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిలో కొందరు రాబోయే రెండు, మూడు నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. దీనికి తోడు నోడ్యూస్ ఇవ్వకుండా పెండింగ్ పెడుతుండటంతో తక్కువ సొమ్ము రికవరీ చేయాల్సి ఉండటంతో కొందరు ఆ మొత్తాలను చెల్లించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. అలా సొమ్ము చెల్లిస్తే తప్పు అంగీకరించినట్లవుతుంది. అలా చేస్తే.. మీపై ఎందుకు చర్యలు చేపట్టకూడదని రాష్ట్రశాఖ ఉత్తర్వులు జారీ చేస్తే పరిస్థితి ఏమిటనే మీమాంసలో పడ్డారు. కీలకమైన ఆర్థిక లావాదేవీలు ఉన్న స్థానంలో కాంట్రాక్ట్ వర్కర్స్‌ను నియమించడంతో ఈ సమస్య ఉత్పన్నమయిందని ఆ శాఖ ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఇంత జరిగినా ఆ స్థానాల్లో తిరిగి కాంట్రాక్ట్ వర్కర్స్‌నే కొనసాగిస్తున్నారు. షోకాజ్ నోటీసులపై యూనియన్ తరఫున ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు.

ప్రజల సొమ్మును దుర్వినియోగం కానివ్వం



అక్రమంగా దారి మళ్లిన సొమ్ము ప్రజల నుంచి వసూలు చేసింది. ఆ సొమ్ము అన్యాక్రాంతం కావడానికి వీలు లేదు. అందులో భాగస్వాములయిన సిబ్బంది ఉద్యోగ విరమణ పొందితే కొన్ని ఇబ్బందులు తలేత్తే అవకాశం ఉంది. దీంతో వారు ఉద్యోగంలో ఉన్నట్లుగానే సమస్యను మరింత వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగానే సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశాం.

-విఘ్నేష్, జిల్లా అటవీశాఖ అధికారి

పైసలకొద్దీ.. పర్సెంటేజీ..!

పాయింట్ల కోసం టీచర్ల అడ్డదారులు

- మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలనలో మాయలు
- బోగస్ చెవుడు సర్టిఫికెట్లతో లబ్ధి
- ఇతర ఉపాధ్యాయుల విస్మయం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- రీవెరిఫికేషన్‌కు సమాలోచనలు
- అక్రమార్కుల్లో ఆందోళన



అనంతపురం టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ప్రిఫరెన్షియల్ పాయింట్లు పెట్టుకుని కోరుకున్న పాఠశాలలకు వెళ్లడానికి కొందరు టీచర్లు చెవుడు మాస్టార్ల అవతారమెత్తారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ పాయింట్లకోసం ప్రభుత్వం స్థానిక జిల్లా సర్వజనాస్పత్రిలో ప్రత్యేక పరిశీలన నిర్వహించింది. విద్యాశాఖ బదిలీల నిబంధనల మేరకు 40 శాతం అంగవైకల్యం ఉంటే 5 పాయింట్లు, 56శాతంపైగా ఉంటే 10, 70శాతంపైన ఉంటే ప్రిఫరెన్షియల్ కింద ముందువరసలో ఉంచి బదిలీల్లో అవకాశం కల్పిస్తారు. దీంతో టీచర్లు ప్రిఫరెన్షియల్ పాయింట్ల కోసం అడ్డదారులు తొక్కారు. చెవుడు లేకున్నా.. ఉన్నట్లు సర్టిఫికెట్లు పొందారు. ఈఎన్‌టీ విభాగంలో పనిచేస్తున్న ఒకరిద్దరు దళారీల ద్వారా ఆమ్యామ్యాలు అప్పగించి డాక్టర్లను మేనేజ్ చేసి చెవుడు లేకున్నా ఉన్నట్లు పర్సెంటేజీ వేసి సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇంతకాలం చెవుడులేకుండా వారు ఉద్యోగాలు చేశారు. ఇపుడు తమకు చెవుడు ఉందని వందమంది వరకు టీచర్లు సర్టిఫికెట్లు పొందడంపై ఇతర ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఓ స్కూల్ అసిస్టెంట్ ఏకంగా 70 శాతంపైగా చెవుడు ఉందని సర్టిఫికెట్ పొందారట. అనంతపురం రూరల్, శింగనమల, కళ్యాణదుర్గం, తాడిపత్రి, రాప్తాడు, హిందూపురం, ధర్మవరం నియోజకవర్గాల్లో కూడా టీచర్లు ఇలాగే చెవిటి సర్టిఫికెట్ పొందారట. ఒకే సామాజిక వర్గానికి చెందిన కొందరు టీచర్లు జట్టుగా ఏర్పడి ఇలా బోగస్ చెవిటి సర్టిఫికెట్లు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యవర్గాలు చెబుతున్న మేరకు 70 నుంచి 80శాతంపైగా చెవుడు ఉంటే వారికి మాటలు కూడా రావట. ఇక్కడ మాత్రం చెవుడు సర్టిఫికెట్లు పొందిన టీచర్లు ఏనాడూ చెవిటి మిషన్ కూడా వాడలేదట. దర్జాగా అందరితో కలిసి తిరిగారు. ఇపుడు మాత్రం 70 నుంచి 80 శాతం చెవుడు ఉందని సర్టిఫికెట్లు పొందడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఇద్దరి పాత్రపై అనుమానాలు

నకిలీ చెవుడు సర్టిఫికెట్ల జారీలో జిల్లా ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారు ఆ విభాగ డాక్టర్లతో మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారట. ఈ నేపథ్యంలో టీచర్ల మెడికల్ సర్టిఫికెట్ల జారీలో ఆ ఇద్దరు డబ్బు సంపాదించాలని అక్రమమార్గంలో సర్టిఫికెట్ల జారీకి ప్లాన్ వేసినట్లు చెప్పుకుంటున్నారు. అప్పటికే పాయింట్ల కోసం అడ్డదారులు తొక్కుతున్న కొందరు టీచర్లు వారిని కలిసినట్లు తెలుస్తోంది. పాయింట్లవారీగా రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఒక్కొక్కరు చెల్లించేలా ఒప్పందం చేసుకుని, పరీక్షలు చేయకుండానే ఇంత శాతం చెవుడు ఉందని డాక్టర్లకు చెప్పడం, సర్టిఫికెట్లపై సంతకాలు చేయించడం చకచకా జరిగిపోయాయని టీచర్లతోపాటు ఆస్పత్రిలో వైద్యసిబ్బంది బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

బోగస్ సర్టిఫికెట్ల జారీపై రాష్ట్ర ఉన్నతాధికారులకు కొందరు టీచర్లు ఫిర్యాదులు చేసినట్లు ఆ వర్గాల ద్వారా తెలిసింది. అక్రమ మార్గంలో పొందిన చెవుడు సర్టిఫికెట్లను పునఃపరిశీలించాలనే ఆలోచనలో రాష్ట్ర అధికారులు ఉన్నట్లు సమాచారం. గతంలో కూడా ఇలాగే కొందరు బదిలీలు, ఉద్యోగోన్నతుల సమయంలో చెవుడు సర్టిఫికెట్లు పెట్టడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అపుడు హైదరాబాద్‌లోని కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రికి రెఫర్‌చేసి రీవెరిఫికేషన్ చేయించారని టీచర్లు అంటున్నారు. కొందరు ఇలాంటి చెవుడు సర్టిఫికెట్లు పెట్టి డీఎస్సీలో ఉద్యోగాలు పొందాలనే ఆరోపణలు రావడంతో అప్పుడు కూడా రీవెరిఫికేషన్ చేయించగా.. బోగస్ అని తేలడంతో పోస్టులు ఇవ్వలేదంటున్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని చూస్తున్నా.. ఇంకా కొందరు బోగస్ మెడికల్ సర్టిఫికెట్లతో అక్రమంగా పాయింట్లు పొంది కోరుకున్న పాఠశాలలకు వెళ్లాలని అడ్డదారులు తొక్కడంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో నష్టపోయే ఉపాధ్యాయులు కొందరు ఇదే విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మెడికల్ క్యాంపులో చెవుడు సర్టిఫికెట్లు పొందిన టీచర్లకు రీవెరిఫికేషన్ పెట్టాలనీ, అందులో బోగస్ అని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం బోగస్ చెవుడు సర్టిఫికెట్ల వ్యవహారం వాటిని పొందిన టీచర్లతోపాటు జారీచేసిన డాక్టర్లలో సైతం ఆందోళన రేపుతోంది.

ఆర్డీటీకి అండగా నిలుద్దాం..

ఉమ్మడి అనంత, ఇతర జిల్లాల్లోనూ కార్యకలాపాలు

- ప్రభుత్వాలకు మించి మౌలిక, విద్యా, వైద్యరంగాల్లో సేవలు
- రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీని కాపాడుకుందాం: వక్తలు
- 1న సీఎం దృష్టికి తీసుకెళ్తాం: ఎంపీ బీకే పార్థసారథి
- కేంద్రమంత్రిని కలుస్తాం: అనంతపురం ఎంపీ అంబికా

అనంతపురం విద్య, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, పార్టీలకు అతీతంగా ప్రజలకు మౌలిక వసతులు, విద్య, వైద్యం, క్రీడా ఇతర రంగాల్లో సేవలు అందిస్తున్న ఆర్డీటీకి అండగా నిలుద్దామని అఖిలపక్ష నేతలు పిలుపునిచ్చారు. అందరు ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు ఏకతాటిపైకి రావాలని కోరారు. సీఎం చంద్రబాబునాయుడు, కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఆర్డీటీకి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ) పునరుద్ధరించేలా ఒత్తిడి తెద్దామని ముక్తకంఠంతో పేర్కొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం జడ్పీలోని సమావేశ మందిరంలో 'ఆర్డీటీని కాపాడుకుందాం- ఎఫ్‌సీఆర్‌ఏను కేంద్రం పునరుద్ధరించాలి' అన్న అంశంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హిందూపురం, అనంతపురం ఎంపీలు బీకే పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప ఇతర నేతలు హాజరయ్యారు. ఆర్డీటీ అందిస్తున్న సేవలను గుర్తు చేసుకున్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కాకపోవడంతో నిధులు అందక, సంస్థ అందిస్తున్న సేవలన్నీ నిలిచిపోతే జిల్లా ప్రజలే నష్టపోతారన్నారు. ఆర్డీటీని కాపాడుకోడానికి ప్రతిఒక్కరూ ముందుకు కదలాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మల్లికార్జున, సీపీఐ ఎంఎల్ నేత నాగరాజు, వీకే రంగారెడ్డి, ఇతర నేతలు రాజేష్‌గౌడ్, కేశవరెడ్డి పాల్గొన్నారు.


ఐక్యత చాటుతున్న అఖిలపక్ష నాయకులు

కేంద్రం దృష్టికి తీసుకెళ్దాం



పేదరిక నిర్మూలన, మహిళా సాధికరతకు ఆర్డీటీ ఎంతగానో కృషి చేస్తోంది. ఆ సంస్థ సహకారంతో ఎందరో డాక్టర్లు, ఇంజనీర్లుగా, ఉన్నత ఉద్యోగులుగా ఎదిగారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు ఇలా అనేక ప్రాంతాల్లో హాస్పిటల్స్ కట్టించి సేవలు అందిస్తోంది. ఆర్థిక సమస్యల్లోనూ ఏడాదిన్నరగా ఆర్డీటీ ద్వారా విరాళాలు సేకరించి సేవలు కొనసాగిస్తున్నారు. ఇప్పుడు ఆర్డీటీకి తోడ్పాటు అందించాలి. సంతకాల సేకరణ కార్యక్రమం చేపడతాం. కేంద్రంలోని ఎన్డీఏ దృష్టికి సమస్యను తీసుకెళ్దాం

- గిరిజమ్మ, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్

1న సీఎం దృష్టికి తీసుకెళ్తాం



విన్సెంట్ ఫెర్రర్ స్పెయిన్ నుంచి వచ్చి 1969లో జిల్లాలో సేవలు ప్రారంభించారు. హాస్పిటల్స్ ఏర్పాటు చేసి రోగులకు, విద్యార్థులకు, మహిళలు, రైతులు ఇలా అన్నివర్గాల ప్రజలకు సేవలు అందించారు. విన్సెంట్ ఫెర్రర్, మాంచో ఫెర్రర్ ఎఫ్‌సీఆర్‌ఏ ద్వారా వచ్చిన డబ్బుతో పారదర్శకంగా ప్రజలకు సేవ చేశారు. ఈ సంస్థ ఉండాలని అందరూ కోరుకుంటున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు అంతా కలిసికట్టుగా ఈనెల 1న సీఎం చంద్రబాబును కలుస్తాం. కేంద్రానికి సిఫార్సు చేయాలని కోరుతాం.

- బీకే పార్థసారథి, హిందూపురం ఎంపీ

56 ఏళ్లుగా సేవలు



ఆర్డీటీ 56 ఏళ్లుగా జిల్లా ప్రజలకు సేవలు అందిస్తోంది. దైవం మానుష రూపేణా అన్నట్టుగా ఫెర్రర్ దేవుడిలా వచ్చి జిల్లాలో సేవలు అందించారు. ప్రస్తుతం ఈ సంస్థకు ఊపిరిపోయాల్సిన అవసరం ఉంది. మాంచో ఫెర్రర్‌తో 3 రోజుల కిందట మాట్లాడా. కేంద్ర మంత్రి బండి సంజయ్ అపాయింట్‌మెంట్ కూడా తీసుకున్నాం. పహల్గాం ఘటన నేపథ్యంలో ఆయన బిజీగా ఉన్నారు. వారం, 10 రోజుల్లో కేంద్రమంత్రిని తప్పకుండా కలుస్తాం. సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం. ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించేలా కృషి చేస్తాం.

- అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం ఎంపీ

కులమతాలకు అతీతంగా సేవలు



అనంతపురం నుంచి ప్రకాశం జిల్లా వరకూ కులమతాలకు అతీతంగా ఆర్డీటీ ప్రజలకు తోడ్పాటు అందిస్తోంది. దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఆర్డీటీ నేడు ప్రమాదంలో పడింది. ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించకపోవడంతో దానిపై ఆధారపడిన వారి జీవితాలు రోడ్డున పడతాయి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలి. ఎఫ్‌సీఆర్ఏను వెంటనే రెన్యువల్ చేయాలి. ఆర్డీటీ సేవలకు అంతరాయం కలుగకుండా చూడాలి.

- జగదీష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

ఆర్డీటీ.. జిల్లాకు వరం



జిల్లాకు ఆర్డీటీ వచ్చినపుడు 'గో బ్యాక్' అంటూ మొదట్లో వ్యతిరేకించారు. ఫెర్రర్ కృషితో ప్రజలకు దగ్గరైంది. నేడు ఈ జిల్లా ప్రజలతో విడదీయరాని బంధాన్ని పెనవేసుకుంది. ప్రభుత్వాల కంటే... ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఆర్డీటీనే ఎక్కువగా ప్రేమిస్తారు. రాజకీయ రంగు అంటకుండా లక్షలాది మందికి ఇళ్లు కట్టించారు. మరెందరినో చదివించారు. కరువు పీడిత అనంతపురం జిల్లాకు ఈ సంస్థ రావడం ఒక వరంగా చెప్పవచ్చు. ఫెర్రర్‌ను దేవుడిగా కొలిచారు. ఈ సంస్థను కాపాడుకోడానికి అందరూ సానుకూలంగా స్పందించాలి.

- విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత

రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి



జిల్లాను ఆర్డీటీ ప్రపంచ పటంలో నిలిపింది. వేలాది మందికి రైతులకు ఉచితంగా బోర్లు వేయించడమే కాకుండా కోటికిపైగా పండ్ల మొక్కలు పంపిణీ చేసింది. పేద విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి ఉన్నత చదువులు అందించింది. 88 వేలకుపైగా ఇళ్లు కట్టించి ఇచ్చింది. మరో కోటి మంది వరకూ వైద్య సేవలు పొందారు. అలాంటి ఆర్డీటీ ప్రమాదంలో పడింది. ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే పునరుద్ధరించాలి. అంతవరకూ ఆర్డీటీ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని, కొనసాగేలా చూడాలి.

- నల్లప్ప, సీపీఎం జిల్లా కార్యదర్శి

ఐక్యంగా ముందుకెళుదాం



ఆర్డీటీ ఎన్నో లక్షల మంది ప్రజల కలలు సాకారం చేసింది. ఎస్సీ, ఎస్టీ, పేదవర్గాల ప్రజలకు ఏ ప్రభుత్వం చేయని విధంగా సేవలు అందించింది. ఒక వైపు కరోనా వచ్చి ప్రజల ప్రాణాలు పోతుంటే... మనుషులను ముట్టుకోడానికి వెళ్లలేని దుర్భర పరిస్థితులు. ఆర్డీటీ వైద్యులు, నర్సులు మాత్రం ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించారు. నేడు ఆర్డీటీని కాపాడడానికి అందరూ ఐక్యంగా కదలాల్సిన అవసరం వచ్చింది. ఆ సంస్థకు అండగా నిలుద్దాం.

- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి

జిల్లాను కాపాడుకున్నట్లే..

- మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

అనంతపురం కల్చరల్: ఆర్డీటీని కాపాడుకుంటే జిల్లాను కాపాడుకున్నట్లేనని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. ఆర్డీటీ సేవలు కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ.. ఆర్డీటీకి అండగా ప్రతిఒక్కరూ స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్డీటీ గురించి ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఆర్డీటీ సేవల కొనసాగింపుకోసం చేపట్టే ఉద్యమంలో అందరూ పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. కేఎం షకీల్ షఫీ మాట్లాడుతూ... జిల్లాలో తినడానికి తిండిలేని సమయంలోనే గంజి కేంద్రాలు ఏర్పాటు చేసి సేవను మొదలు పెట్టింది ఆర్డీటీనేనన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 12 జిల్లాల్లో ఆర్డీటీ సేవలందిస్తోందన్నారు. జిల్లాను ఎడారి కాకుండా నిలువరించిందన్నారు. అటువంటి సేవా సంస్థను కాపాడుకునేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా అభాగ్యులు, పేదలకు నివాస స్థలాలు, భవనాలు నిర్మించి ఆర్డీటీ ఆదుకుంటోందన్నారు. ప్రభుత్వాలు సైతం చేయలేనన్ని సేవాకార్యక్రమాలను ఆర్డీటీ చేస్తోందన్నారు. ఆర్డీటీ సేవల కొనసాగింపు కోసం సమిష్టిగా పోరాడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళీధర్, నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, మాజీ మేయర్ స్వరూప, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, నేతలు మచ్చా రామలింగారెడ్డి, రవికాంత్ రమణ, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు తాజుద్దీన్, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, కాగజ్ ఘర్ రిజ్వాన్, ఎంఎండీఏ ఇమామ్, బీఎస్ఎన్ఎల్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పార్టీలకు అతీతంగా సంఘీభావం తెలుపుతున్న నాయకులు

9 నుంచి పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలు


పోస్టర్లు విడుదల చేస్తున్న ఈఓ, ఆలయ సిబ్బంది, టీడీపీ నాయకులు

ఉరవకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మే 9 నుంచి 20 వరకు జరగనున్నాయి. అందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆలయ ప్రాంగణంలో ఈఓ రమేష్‌బాబు, అర్చకుడు ద్వారకానాథాచార్యులు, టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుర్రం సుధాకర్, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ మే 9న అమిద్యాల నుంచి ఉత్సవ మూర్తులు పెన్నహోబిలం చేరడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 10న ప్రాకారోత్సవం, 11న సింహ వాహనోత్సవం, చంద్రప్రభవాహనోత్సవం, 12న గోవువాహనోత్సవం, శేషవాహనోత్సవం, 13 హంసవాహనోత్సవం, 14 హనుమంతవాహనోత్సవం, 15 గరుడ వాహనోత్సవం, కల్యాణోత్సవం, 16న సూర్యప్రభ, ఐరావతవాహనోత్సవం, 17న రథోత్సవం, 18నఅశ్వ వాహనోత్సవం, 19నధ్వజారోహణం, శయనోత్సవం 20న ఉత్సవమూర్తులు పెన్నహోబిలం నుంచి అమిద్యాలకు తిరిగి వెళ్లటంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

చీనీ టన్ను రూ.23వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 23,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4వేలు, సరాసరి రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1047 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రైల్వే డివిజన్లలో భద్రతా చర్యలు చేపట్టండి

గుంతకల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలోని డివిజన్లలో ప్రయాణికుల భద్రత విషయంగా చర్యలు చేపట్టాలని జీఎం అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి ఆరు డివిజన్ల డీఆర్ఎంలతో జీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుంతకల్లు డివిజన్ నుంచి డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పాల్గొన్నారు. జీఎం జైన్ ఈ సదస్సులో రైల్వేస్టేషన్లు, రైళ్లలో ప్రయాణికుల భద్రతపై సమీక్ష నిర్వహించారు. రైల్వే స్టేషన్లలోనూ, రైళ్లల్లోనూ జీఆర్పీ, ఆర్పీఎఫ్ దళాలు గస్తీను ముమ్మరం చేయాలని సూచించారు. రైల్ ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతకు సంబంధించి స్పెషల్ డ్రైవ్‌ల పనితీరుపై ప్రశ్నించారు. లెవెల్ క్రాసింగ్‌లు, రూట్ సైడింగ్‌లపై, ఏసీ కోచ్‌లలో పొగను గుర్తించే డివైజ్‌లు, అగ్నిమాపక యంత్రాల విషయంగా సమీక్ష చేశారు. ప్రమాదాలు, చోరీలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో గుంతకల్లు డీఆర్ఎంతోపాటు సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వృద్ధురాలి మృతి

తాడిపత్రి, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లవారిపల్లి సమీపంలో సోమవారం గుర్తుతెలియని వృద్ధురాలు రైలుకిందపడి మృతిచెందిందని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. ఆమెకు 60సంవత్సరాలుపైగా వయసు ఉంటుందనీ, వృద్ధురాలి వివరాలు పూర్తిగా తెలియలేదని ఆయన తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు సమన్యాయం

రెండు నామినేటెడ్ పదవుల్లో సామాజిక సమతుల్యం

- ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి
- డీసీఎంఎస్ చైర్మన్‌గా నెట్టెం వెంకటేష్


ముంటిమడుగు కేశవరెడ్డి


నెట్టెం వెంకటేష్

అనంతపురం, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో ఉమ్మడి జిల్లాకు టీడీపీ అధినాయకత్వం సమన్యాయం చేసింది. సామాజిక సమతుల్యాన్ని పాటించింది. అనంత జిల్లా నుంచి ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలానికి చెందిన ముంటిమడుగు కేశవరెడ్డిని నియమించింది. శ్రీసత్యసాయి జిల్లా నుంచి రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి మండలానికి చెందిన నెట్టెం వెంకటేష్‌ను డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎంపిక చేసింది. ఆ మేరకు సోమవారం టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారికంగా ప్రకటించారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితుడైన ముంటిమడుగు కేశవరెడ్డి శింగనమల నియోజకవర్గం, మరీ ముఖ్యంగా గార్లదిన్నె మండలంలో తెలుగుదేశం పార్టీకి బలమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. సుదీర్ఘకాలంగా తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ... అధినాయకత్వం ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వైసీపీ ప్రభుత్వాన్ని ఎండగట్టడంలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. శింగనమల నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకుగానూ అధినాయకత్వం ద్విసభ్య కమిటీలో ముంటిమడుగుకు స్థానం కల్పించింది. ఆ స్థాయిలోనే పార్టీని బలోపేతం చేసేందుకు ఆయన కృషి చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయం కోసం తనవంతుగా పాటుపడ్డాడు. పార్టీ విధేయుడిగా కొనసాగుతున్న నేపథ్యంలోనే... ఆయనకు ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా అధిష్టానం అవకాశం కల్పించిందన్న అభిప్రాయం స్థానిక నేతల్లో వ్యక్తమవుతోంది. రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండలానికి చెందిన నెట్టెం వెంకటేష్ ఆది నుంచీ పరిటాల కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. పరిటాల రవి రాజకీయాల్లోకి ప్రవేశించిన తొలినాళ్ల నుంచే నెట్టెం వెంకటేష్ టీడీపీలో చురుగ్గా కొనసాగుతున్నారు. పార్టీ కనగానపల్లి మండల కన్వీనర్‌గానే కాకుండా మాజీ ఎంపీపీగా కూడా పనిచేశారు. పార్టీలోనూ అనేక రాష్ట్రస్థాయి పదవుల్లో కొనసాగారు. పరిటాల రవి హత్యానంతరం ఆయన సతీమణి పరిటాల సునీత రాజకీయాల్లోకి వచ్చిన తరువాత కూడా... నెట్టెం వెంకటేష్.. ఆ కుటుంబం వెంటే నడిచారు. ఓవైపు పరిటాల కుటుంబానికి... మరోవైపు తెలుగుదేశం పార్టీకి క్రియాశీలకంగా నెట్టెం వెంకటేష్ పనిచేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయనను డీసీఎంఎస్ చైర్మన్‌గా పార్టీ అధిష్టానం నియమించింది. ఏడీసీసీ, డీసీఎంఎస్ చైర్మన్లుగా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేష్.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, జిల్లాలోని పార్టీ ముఖ్య నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని వారు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

అనంతపురంటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సివిల్స్ పరీక్షలకు పోటీపడే జిల్లా అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మే 25న యూపీఎస్సీ ద్వారా సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు పోటీపడే జిల్లా అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వడానికి ఏఆర్‌జీ రిఫ్లెక్షన్ అనే సంస్థ ముందుకు వచ్చిందన్నారు. ప్రతిభ గల అభ్యర్థులు ఢిల్లీ, హైదరాబాద్‌లోనే కాదు.. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉంటారని పేర్కొన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే జిల్లాలోనూ సివిల్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇప్పించాలని నిర్ణయించామని అన్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం మే 4న ఎంట్రెన్స్ నిర్వహిస్తున్నామని, అందులో 20 మార్కులు తెచ్చుకున్న అభ్యర్థులకు మాత్రమే ఉచిత శిక్షణకు అవకాశం కల్పిస్తాం అన్నారు. పరీక్ష ఎక్కడ నిర్వహిస్తామనేది తర్వాత తెలియజేస్తామన్నారు. ఉచిత శిక్షణ బాధ్యతలను జిల్లాకు చెందిన విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ కరణం రామారావుకు అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు.

హౌస్ వైరింగ్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌పై ఈనెల 6వతేదీ నుంచి 30రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆధార్, రేషన్‌కార్డు కలిగి ఉమ్మడి జిల్లాలో 18-45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన గ్రామీణ నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు 9492583484 నంబరులో సంప్రదించాలని కోరారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో రీనోటిఫికేషన్ జారీ చేసిన మద్యం షాపులకు ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి పట్టణంలో మూడు, కళ్యాణదుర్గంలో ఒకటి, శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరలో రెండు, గుడిబండలో ఒకటి, అమరాపురంలోని ఒక మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. ఆయా జిల్లాల్లో ఏ ఎక్సైజ్ స్టేషన్‌లోనైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 3వతేదీ సాయంత్రం 5 గంటల దాకా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. మే 5వతేదీ ఉదయం 8 గంటలకు అనంతపురం, సత్యసాయి జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లో లాటరీ తీయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షల నాన్‌రీఫండబుల్ ఫీజు చెల్లించాలన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం బస్టాండు ఆవరణలో రిలేదీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ.. ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019ను అన్ని డిపోలలో అమలు చేసి, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపాలని డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే కల్పించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని అన్నారు. జీఓ 114లో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సులను రూ.150 నుంచి రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సదాశివరెడ్డి, మద్దిలేటి, కేకే రావు, శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు, రామాంజనేయులు, నీలకుమార్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


రిలేదీక్షలు నిర్వహిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఈడీ సుబ్రహ్మణ్యం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మైనార్టీలు (ముస్లింలు, క్రిష్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారశీకులు) స్వయం ఉపాధి రుణాలకు ఏపీఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్‌లో దరఖాస్తు చేసుకునే వారు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింకు అయిన మొబైల్ నంబరు నమోదు చేయాలన్నారు. దరఖాస్తుదారుడు ఉమ్మడి అనంతపురం జిల్లా వాసి అయి ఉండాలన్నారు. వయస్సు 21 నుంచి 55 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు, రూరల్ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు కలిగి ఉండాలన్నారు. జనరిక్ మెడిసిన్ సెక్టార్‌లో రుణాలకు దరఖాస్తు చేసుకునే వారు పై అర్హతలతోపాటు డీ ఫార్మసీ/బీ ఫార్మసీ/ఎంఫార్మసీ చేసి ఉండాలన్నారు. మే 25వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తు హార్డ్ కాపీని పట్టణవాసులు మున్సిపల్ కమిషనర్‌కు, గ్రామీణ ప్రాంతాల వారు ఎంపీడీఓకి అందజేయాలన్నారు.

గురుకుల ప్రవేశాలకు..

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 3వ తరగతి (నూతన ప్రవేశం), 4 నుంచి 9వ తరగతిలో బ్యాక్‌లాగ్ కింద ఎస్టీ విద్యార్థులచే ఖాళీ సీట్లను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అడ్మిషన్లు కావాల్సిన విద్యార్థులు సంబంధిత పాఠశాలల నందు మే 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 30న అనంతపురంలోని గిరిజన గురుకుల పాఠశాలలో లాటరీ తీస్తామన్నారు. 3వ తరగతి ప్రవేశంలో మాత్రమే ఎస్టీ 32, ఎస్సీ 05, బీసీ 02, ఓసీ 01 రిజర్వేషన్ విధానంలో భర్తీ చేస్తామని వివరించారు. కాగా... గొల్లలదొడ్డిలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎస్టీలకు 36 సీట్లు, ఎస్సీ, బీసీ, ఓసీ, ఏఈక్యూఎస్‌లకు ఒక్కొక్క సీటు చొప్పున కేటాయించామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు మే 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9885369079, 8978239363, 8341603090కు సంప్రదించాలన్నారు.

జిల్లాకు 54,184 క్వింటాళ్ల విత్తనాల కేటాయింపు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 54,184 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వేరుశనగ 50,592 క్వింటాళ్లు కేటాయించారు. వరి 800, మినుములు 36, పెసలు 60, కంది 2380, అలసంద 60, రాగి 4, కొర్ర 45, జీలుగ 190, జనుము 2, పిల్లిపెసర 15 క్వింటాళ్లను కేటాయించారు.

న్యూస్ బాక్స్

2 వరకు తహసీల్దార్ సెలవు

రాప్తాడు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ విజయకుమారి మే 2వ తేదీ వరకు సెలవు పెట్టినట్లు ఆర్ఐ కరుణాకర్ తెలిపారు. ఆమె సోమవారం నుంచి మే 2 (శుక్రవారం) వరకూ 5 రోజులు సెలవు తీసుకున్నారన్నారు. అప్పటి వరకూ డిప్యూటీ తహసీల్దార్ చెన్నకేశవులు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తారని ఆర్ఐ తెలిపారు.

రాయితీ పరికరాల కోసం సంప్రదించండి: ఏఓ

శింగనమల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : సన్నకారుల రైతులకు ప్రభుత్వం రాయితీతో అందించే వ్యవసాయ యాంత్రీ కరణ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. సన్నకారు రైతులకు ట్రాక్టర్‌కు సంబంధించిన యాంత్రికరణ పరికరాలను రాయితీతో ఇస్తున్న ట్లు తెలిపారు. మండలంలోని అర్హులైన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఏఓ తెలిపారు.

రేపటి నుంచి జయలక్ష్మీమాత జయంత్యుత్సవాలు

రాప్తాడు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మేపర్తి (జయలక్ష్మీపురం) గ్రామంలో ఈనెల 30 నుంచి మే 4 వరకు జయలక్ష్మీమాత జయంత్యుత్సవాలు, లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు ఆశ్రమ నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి, ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ హాజరవుతారన్నారు. వారి చేతుల మీదుగా ఈనెల 30న అక్షయ తృతీయ పూజ జరుగుతుందన్నారు.

గ్రామ దేవత పూజలకు హాజరైన ఎమ్మెల్యే

ఆత్మకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సనప గ్రామంలో సోమవారం గ్రామ దేవత పూజ కార్యక్రమాలుకు ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని టీడీపీ నాయకులు ఇళ్లకు వెళ్లి, వారి కుటుంబ సభ్యులుతో ముచ్చటించారు. గ్రామంలో పరిస్థితిని సమీక్షించా రు మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు నారాయణ స్వామి, రఘునాథరెడ్డి, పోతులయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన


విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 582 మార్కులు సాధించిన నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని సాకే శ్వేతను ఎమ్మెల్యే పరిటాల సునీత అభినందించారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని సాకే శ్వేత, కుటుంబ సభ్యులు సోమవారం ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థిని పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మరింత బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

విద్యతోనే గుర్తింపు : మేయర్


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మేయర్

రాప్తాడు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విద్యతోనే విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుం దని అనంతపురం నగర మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి సమీపంలో ఉన్న ఎల్ఆర్‌జీ పాఠశాలను మేయర్ సోమవారం సందర్శించారు. పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన సుమియాబాను, అఖిల, నవిత, కుమారి లక్షిలాస్య, సృజన్ తదితర విద్యార్థులను శాలువాలు, పూల బొకేలతో అభినందించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

నార్పల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జీవన మాట్లాడుతూ.. విద్యార్థులకు పుస్తక పఠనం, గేమ్స్ పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

యోగా వేసవి శిక్షణ తరగతులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో వేసవిలో ఉచిత యోగాసన శిక్షణా తరగతలను 40రోజులపాటు నిర్వహిస్తున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎలా సిద్ధం కావాలనే అంశాలపైతొమ్మిదేళ్ల నుంచి 20సంవత్సరాల వరకు గల బాల, బాలికలకు వేసవి సెలవుల సందర్భంగా శిక్షణ ఉంటుందన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తరగతులు జరుగుతా యన్నారు. వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 9441252258, 9393938449ను సంప్రదించాలని కోరారు.

4న మాదిగ ఎమ్మెల్యేల అభినందన సభ

● ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు బండారు శంకర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మే 4వ తేదీన మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందనసభ ఏర్పాటు చేసినట్లు మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్(ఎంఈఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడు బండారుశంకర్ తెలిపారు. నగరంలోని ఉపాధ్యాయభవన్‌లో సోమవారం ఎంఈ ఎఫ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేల ఆత్మీయ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యేలు ఎంఎస్‌రాజు, బండారు శ్రావణిశ్రీ, కర్నూలు జిల్లాకు చెందిన కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను సత్కరించనున్నట్లు తెలిపారు. ఎంఈ ఎఫ్ నాయకులు గంగాధర్, అమర్‌నాథ్, రమేష్, అశోక్‌కుమార్, పుల్లన్న, నాగేంద్ర. నాగభూషణ, కిష్టప్ప పాల్గొన్నారు.

రహదారి పక్కన...ఐదు రోజుల శిశువు


శిశువును ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

అనంతపురం క్రైం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎవరు గానీ ఐదురోజుల ఆడశిశువును నగరంలోని విజయనగర కాలనీ లో వదిలేశారు. సోమవారం రాత్రి ప్రధాన రహదారిలో పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న ఓ ఇంటి ఎదుట శిశువును ఉంచివెళ్లారు. స్థానికులు గమనించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఆ శిశువును ఐసీడీఎస్ సిబ్బంది ద్వారా 108లో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

అన్న ఉన్నాడు.. ధైర్యంగా సమస్యలు చెప్పండి

● మంత్రి నారా లోకేశ్ నన్ను మీ కోసమే పంపించారు ● కేఎస్ఎన్ కళాశాలల విద్యార్థినిలతో ఎమ్మెల్యే దగ్గుపాటి


కాలేజీ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కేఎస్ఎన్ ప్రభుత్వ బాలికల కళాశాలను అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమవారం సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. 'విద్యాశాఖ మంత్రి, అన్న నారా లోకేశ్ నన్ను పంపించారు. మీ సమస్యలను ధైర్యంగా చెప్పండి..' అని సూచించారు. గదుల కొరత ఉందని, ఒక్కో గదిలో 20 మంది ఉంటున్నామని, భోజనం సరిగా ఉండటం లేదని, నీటి కొరత ఉందని, సెక్యూరిటీ లేదని వారు ఎమ్మెల్యేకి వివరించారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. హాస్టల్ గదులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపల్ కార్యాలయంలో అధ్యాపకులతో సమస్యల గురించి చర్చించారు. హాస్టల్ భవనాలు, అదనపు తరగతి గదుల కోసం కలెక్టర్‌కు లేఖ రాశామని, సీఎస్ఆర్ ఫండ్స్ కింద సాయం చేయాలని వివిధ కంపెనీలకు విన్నవించామని ప్రిన్సిపాల్ సత్యలత వివరించారు. గత ప్రభుత్వంలో ఎంపీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఎమ్మెల్యే వస్తుండటంతో నగరపాల సంస్థ అధికారులు పారిశుధ్య కార్మికులను పంపి కళాశాల ఆవరణను శుభ్రం చేయించారు.

రూ.40 లక్షలు ఇప్పిస్తా..

కాలేజీ సమస్యలపై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. వారం రోజుల పాటు పారిశుధ్య పనులు చేయించాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. సత్యసాయి పథకం పైప్‌లైన్ ఏర్పాటు చేసి, నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. భవనాల పునర్నిర్మాణం, అదనపు భవనాల కోసం అంచనాలు రూపొందించాలని సివిల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ పనులకు కలెక్టర్ ద్వారా రూ.40 లక్షల నిధులను తక్షణమే మంజూరు చేయిస్తానని, మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడుతానని ఎమ్మెల్యే తెలిపారు. బోధనేతర సిబ్బంది, సెక్యూరిటీ కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పెట్టాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నియామకాలు జరిగేలా చూస్తామని ప్రిన్సిపాల్‌కు ఎమ్మెల్యే సూచించారు. గెస్ట్ లెక్చరర్లు, స్వీపర్లు తగిన పారితోషికం ఇవ్వాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

వైసీపీ నిర్వాకమే..

వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగానే కళాశాలలో సమస్యలు తలెత్తాయని ఎమ్మెల్యే అన్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం కళాశాలలో అదనపు భవన నిర్మాణాలు చేపట్టి, 70శాతం పూర్తి చేసిందని, ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఎలుకలు కొరికిన ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ప్రజల వినతులపై చిన్నచూపు వద్దు

● ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి ● అధికారులకు కలెక్టర్ ఆదేశం


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

అనంతపురంటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇస్తున్న వినతులపై ఎక్క డా, ఎవరూ చిన్న చూపు చూడొద్దని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మొత్తం 445మంది బాధితులు తమ సమస్యలపై వినతు లు ఇచ్చుకున్నారు. కలెక్టరు వినోద్ కుమార్, జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహర్, డీఆర్‌ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామక్రిష్ణారెడ్డి, తిప్పేనాయక్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారం, పథకాల అమలు, శాఖల తీరుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీ పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అ లాగే ఎండాకాలం కావడంతో అధిక ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

గుంటూరు మేయర్‌కు శుభాకాంక్షలు


గుంటూరు మేయర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ జిల్లా నాయకులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ మేయర్‌గా ఎన్నికైన కోవెలమూడి రవీంద్ర నానికి జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. జోన్-5 టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న రవీంద్ర నాని గుంటూరు మేయర్‌గా ఎన్నికైన సందర్భంగా సోమవారం గుంటూరులోని ఆయన క్యాంప్ కార్యాల యంలో జిల్లాకు చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసా నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, రాయల్ మురళి, రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్‌నాయుడు, నాయకులు సుధాకర్‌నాయుడు, కూచి హరి, చంటి తదితరులు రవీంద్ర నానికి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బనగానపల్లె పరిశీలకుడిగా నటేష్ చౌదరి



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నంద్యాల జిల్లా బనగా నపల్లె నియోజకవర్గం పార్టీ పరిశీలకుడిగా అనంతపురం నగరానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి నటేష్ చౌదరిని నియమిం చారు. ఈ మేరకు టీడీపీ అధిష్ఠానం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నటేష్ చౌదరి మాట్లాడుతూ... పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, బనగానపల్లె టీడీపీ నాయకులను సమన్వయం చేసుకొని ముందుకు వెళతానన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

రెవెన్యూ అధికారులతో రైతుల వాగ్వాదం

ఆత్మకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టాభూముల రికార్డులు మార్పు చేస్తున్నారని ఆరోపిస్తూ వడ్డుపల్లికి చెందిన రైతులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామంలోని పలు సర్వేనంబర్లలోని పలువురు రైతుల పట్టా భూము విస్తర్ణాన్ని మార్చేశారని, ఈ విషయం ఇటీవల సర్వే చేసినప్పుడు బయట పడిందని ఆరోపించారు. ఇష్టరాజ్యంగా రికార్డులు మార్చే అధికారం ఎవరిచ్చారని రైతులు జి శ్రీనివాసులు, చంద్రశేఖర రెడ్డి, వెంకట్రామి రెడ్డి, హరినాథరెడ్డి, వెంకటరాముడు, ఓబిరెడ్డి, రామలక్ష్మి, రామంజనేయులు తదితరులు తీవ్రంగా మండి పడ్డారు. రైతులుకు ఎలాంటి సమాచారం లేకుండా రికార్డులు మార్చేందుకు సర్వేయర్ మాధురి, ఆర్ఐ నాగభూషనం కారణమని వాపోయారు. విచారించి సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్థామని అక్కడి అధికారులు తెలుపడంతో రైతులు శాంతించారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

అనంతనగరంతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలోను ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన సోమవారం నగరపాలక, మున్సిపల్ అధికారులుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిత్యం మ్యాన్‌ఫ్యాక్చరింగ్, అమ్మకాలు చేసే షాపులపై సిబ్బందితో తనిఖీలు చేసి జరిమానాలు విధించాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టరు సూచించారు.

అనంత ఆణిముత్యాలుకు ఆర్థిక సాయం

జిల్లాలో పేదవిద్యార్థుల ఉన్నత చదువులకోసం అమలు చేస్తున్న అనంత ఆణిముత్యాలు పథకానికి రెవెన్యూ అధికారులు చేయూతనందించారు. అనంత ఆర్డీఓ కేశవనాయుడు తమ డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు, ఉద్యోగులతో కలిసి రూ.75 వేలు, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు తమ రెవెన్యూ డివిజన్ అధికారులు ఉద్యోగులు కలిసి రూ. 70వేలను విరాళంగా సోమవారం కలెక్టర్‌కు అందజేశారు.

వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

శింగనమల ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండిచిన వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ప్రభుత్వమే వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తరిమెల భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేశారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

గార్లదిన్నె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన గార్లదిన్నె నుంచి కూడేరు బైపాస్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు పిలుపునిచ్చారు. సంబంధిత పోస్టర్లను సోమవారం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల వద్ద విడుదల చేశారు.

సమన్వయంతో పనిచేయండి: ఎస్పీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ మెరుగు దలకు అంకిత భావం, సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో ట్రాఫిక్, నగర పోలీసులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచించారు. ముగ్గురు సిబ్బంది తమ సమస్యలు చెప్పగా పరిష్కారం చూపారు. సమావేశంలో అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు వెంకటేష్‌నాయక్, కనుమూరి సాయినాథ్, రాజేంద్రనాథ్‌యాదవ్, శాంతిలాల్, ట్రాఫిక్ ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు,కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వేసవి శిక్షణతో నైపుణ్యాల మెరుగు: జేసీ

అనంతపురం విద్య, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణా శిబిరాల్లో శిక్షణ పొందిన విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చు కోవాలని జేసీ శివ నారాయణ శర్మ సూచించారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయసంస్థ కార్యాలయంలోని ఆడిటోరియంలో వేసవి శిక్షణా కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... జూన్ 6వ తేదీ వరకు గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. అనేక అంశాలపై ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ, ఇతర ఉద్యోగులు, ట్రైనర్లు శ్రీహరి, శ్రీరాములు, బృందా, వెంకటేశప్ప, రమేష్‌కుమార్, వినోద్‌కుమార్, సూర్యనారాయణ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె వాహనంపైనే మోజు..!

● అధికారి సొంత వాహనానికి అద్దె చెల్లింపు
● రెండేళ్లుగా ఏడీసీసీ బ్యాంకులో నిధులు డ్రా చేస్తున్న వైనం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సొంత వాహనం ఉన్నా, అద్దె వాహనంపైనే మోజు ఎక్కువ. ఇదీ ఏడీసీసీ బ్యాంకులో గత రెండేళ్లుగా సాగుతున్న వైనం. నెలకు రూ.50వేలు చొప్పున అద్దె డ్రా చేస్తున్న ఏడీసీసీ బ్యాంకు అధికారుల తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏపీ 02 బీజీ 0126 నంబరు ఉన్న వాహనం ఏడీసీసీ బ్యాంకుకు ఉంది. ఇదే వాహనాన్ని ఏడీసీసీ బ్యాంకు అధికారులు వినియోగించాల్సి ఉంటుంది. అయితే ఇందుకు విరుద్ధంగా ఏపీ 39 డీడీ 1431 వాహనాన్ని అద్దెకు వినియోగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎల్లో కలర్ బోర్డు ఉండే వాహనాన్ని అద్దెకు తీసుకోవాలి. ఏడీసీసీ బ్యాంకులో మాత్రం ఓ అధికారికి చెందిన వాహనాన్ని బ్యాంకు పనులను ఉపయోగించుకుంటూ అద్దె పేరుతో ప్రతి నెల రూ.50వేలు వరకు డ్రా చేసుకుంటున్నారు. గతంలో ఏడీసీసీ బ్యాంకుకు చెందిన సొంత వాహనాన్ని ఓ అధికారి తన కుటుంబ సభ్యులకు వినియోగించారు. వడ్డిపల్లి టోల్‌గేట్ వద్ద చెల్లించిన ఫీజుతో విషయం బయటకు పొక్కింది. అదే బాటలోనే ప్రస్తుతం సొంత వాహనాన్ని అందులోనూ వైట్‌బోర్డు ఉన్న వాహనాన్ని అద్దెకు వినియోగించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ఏడీసీసీ బ్యాంకుకు ఉన్న సొంత వాహనాన్ని పక్కన షెడ్డులో పెట్టి, అద్దె పేరుతో అధికారి వ్యక్తిగత సొంత వాహనాన్ని వినియోగించడం పట్ల ఆ శాఖలోని ఉద్యోగులే చర్చించుకుంటుండడం గమనార్హం.



షెడ్డులో ఉన్న బ్యాంకు సొంత వాహనం



బ్యాంకు అధికారులు వినియోగిస్తున్న అద్దె వాహనం

అసిస్టెంట్ కలెక్టర్‌గా సచిన్ రహర్


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ట్రైనీ నూతన అసిస్టెంట్ కలెక్టర్‌గా సచిన్‌రహర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇంతకు ముందు ఇక్కడ పనిచేస్తున్న అసిసెంట్ కలెక్టర్ బొల్లినేని వినూత్న శిక్షణ పూర్తికావడంతో గతనెలలో వెళ్లిపోయారు. తాజాగా 2024 ఐఏఎస్ బ్యాచ్ రాజస్థాన్‌కు చెందిన సచిన్‌రహర్‌ను అనంతజిల్లాకు అసిస్టెంట్ కలెక్టర్‌గా కేటాయించారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం జిల్లాకు వచ్చి తొలుత కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మను మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. వారిద్దరితో కలిసి తొలిరోజే కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో పాల్గొన్నారు. ఆయన శిక్షణ కాలం ముగిసేవరకు అనంతజిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా కొనసాగనున్నారు.

మహిళా సాధికారత కోసం నేపాల్‌కు సైకిల్ యాత్ర

● విజయవంతం కోసం ఎమ్మెల్యే శ్రావణిశ్రీ చేయూత


సమీరా ఖాన్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న వేధింపులు, అత్యాచారాలు, వరకట్న, లైంగిక వేధింపుల నిర్మూలను కోరుతూ, మహిళా సాధికారతకోసం అనంతపురం నగరానికి చెందిన సమీరా ఖాన్ త్వరలో అనంతపురం నుంచి నేపాల్‌కు సైకిల్ యాత్ర చేపట్టనున్నారు. యాత్రకు అయ్యే ఖర్చులకోసం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని సంప్రదించారు. ఈ నేపథ్యంలో శింగనమలకు చెందిన సప్తగిరి క్యాంపర్ ప్రైవేట్ కర్పూరం పరిశ్రమ యాజమాన్యం సహకారంతో సోమవారం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో సమీరా ఖాన్‌కు రూ.లక్ష ఆర్థిక సహకారం అందజేయడంతో పాటు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళా సాధికారత కోసం మరింతమంది ఇలాంటి యువతులు ముందుకు వచ్చి కృషి చేయాలన్నారు. సమీరా ఖాన్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, సప్తగిరి సంస్థ యాజమాన్యం వైస్ చైర్మన్ హనీఫ్, శ్రీరామిరెడ్డి, జీసీ బాబు పాల్గొన్నారు.

'ఆర్డీటీని రక్షించుకుందాం'

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా జిల్లాలో పేదలకు సేవలందిస్తున్న ఆర్డీటీని రక్షించుకుందాం, జిల్లాను కాపాడుకుందామని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు సోమవారం స్థానిక జడ్పీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎల్లన్న, చిరంజీవి, ఎంఎస్ఎఫ్ నాయకులు నగేష్, జైభీం నాయకులు రామాంజినేయులు, ఓబుళేసు, వీరాంజినేయులు, రామాంజినే యులు, ఎర్రిస్వామి, ప్రభాకర్, రామచంద్ర, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

● శింగనమల: పేద, బడుగు వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను వెంటనే పురుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. చిన్నప్పయాదవ్ కోరారు. ఈ మేరకు సీపీఐ నాయకులు సోమవారం ఆర్డీటీ లబ్ధిదారులతో కలసి శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మధుయాదవ్, నేసే మధు, చికెన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కేశవరెడ్డి నియామకంపై సంబరాలు


గార్లదిన్నె బస్టాండ్ సర్కిల్లో కేక్ కట్‌చేసిన టీడీపీ నాయకులు

గార్లదిన్నె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా టీడీపీ శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డిని నియమిస్తూ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. విషయం తెలుసుకున్న గార్లదిన్నె మండలంతో పాటు శింగనమల నియోజకవర్గం, అనంతపురం పరిధిలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. గార్లదిన్నె బస్టాండ్ సర్కిల్లో సోమవారం రాత్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేకులు కట్‌చేసి బాణసంచాలు పేల్చారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, టీడీపీ నాయకులు గేటుక్రిష్ణారెడ్డి, గుర్రం ఆదినారాయణ, పాండు, గుత్తాబాలకృష్ణ, జయారం, గుర్రం శీనా, పవన్, సుబ్బయ్య, రామాంజి, మర్తాడు శేఖర్, కొడిదల రామకృష్ణ, శీనా, గుత్తా లక్ష్మీనారాయణ, చలపతి, రాము, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

'ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి'

అనంతపురం రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థినులపై ఎలుకలు దాడి చేయడం, నాసిరకంగా వంట సామగ్రిని ఉపయోగించిన సంఘటనలతో ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సాకే చిరంజీవి డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం కలెక్టర్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. కళాశాలలో విద్యార్థులు నిత్యం అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీతలకు సన్మానం


గిన్నిస్ రికార్డ్ సాధించిన పెన్నోబుళాన్ని సన్మానిస్తున్న ఎస్పీ రాజేష్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కీబోర్డులో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నమోదు చేసిన తపాల శాఖలో పనిచేస్తున్న జెన్నే పెన్నోబుళాన్ని తపాశాఖ సూపరింటెండెంట్ రా జేష్ సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాల కార్యాలయంలో సోమవారం జెన్నె పెన్నోబుళం, ఆయన కుమార్తెను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. అదేవిధంగా ప్రధాన తపాల కార్యాలయంలో ఏబీపీఎంగా విధులు నిర్వహిస్తున్న స్వామినాయక్ ఐపీపీబీ అకౌంట్స్ ఓపెనింగ్‌లో మొదటి స్థానం సాధించి నందున సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎన్‌పీఓ యూనియన్ నాయకులు గణే నాయక్, ఎన్‌సీ శర్మ, రామాంజినేయులు, విశ్వనాథ్, రామకృష్ణ పాల్గొన్నారు.

వేసవి శిక్షణను వినియోగించుకోండి

యాడికి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెం పొందించుకోవాలని మండల కేంద్రంలోని గ్రం థాలయ అధికారి మధుసూదన్ సూచించారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం ఆయన వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రంథాలయంలో అవసరమైన అన్నిరకాల విజ్ఞాన పుస్తకాలు అందుబాటులో ఉ న్నాయన్నారు. అలాగే డ్రాయింగ్, చెస్, క్విజ్ తదితర వాటిపై శిక్షణ ఇసామన్నారు. విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి 11:30 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పారు. ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

●తాడిపత్రి: పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరం ప్రారంభించినట్లు గ్రంథాలయ అధికారి రవికుమార్‌నాయుడు తెలిపారు. విద్యార్థులను తల్లిదండ్రులు గ్రంథాలయానికి పంపాలని సూచించారు.

●పెద్దవడుగూర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవిశిక్షణా తరగతులను ఎంఈఓ రాముడు ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ శిక్షణను విద్యార్థు లు వినియోగించుకోవాలని కోరారు. పలువురు పాఠకులు పాల్గొన్నారు.

●యల్లనూరు: మండలకేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఇందులో లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

● బొమ్మనహాళ్ ఆర్డీటీ పాఠశాలలో గ్రంథాలయ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఈఓపీఆర్డీ దాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి బాబా ప్రసాద్, ఆర్డీటీ ఉపాధ్యాయుడు బసవరాజు పాల్గొన్నారు.

రేపు పాలిసెట్

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ 2025ప్రవేశ పరీక్ష బుధవారం నిర్వహించనున్నట్లు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్‌వీ రమణారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక సరోజినీనాయుడు మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాల, ఎస్‌జేపీ ఉన్నతపాఠశాల, సర్వేపల్లిరాధాకృష్ణ మున్సిపల్ పాఠశాల, డాక్టర్ రాజేంద్రప్రసాద్ మున్సివల్ ఉన్నతపాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌లను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

గేట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఎండీ రఘునాథ్‌రెడ్డి

గుత్తి, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ విద్యార్థులు ఇండియా డిజైన్ వీక్ 2025 సౌత్ రీజియన్ గ్రాంట్ ఫైనల్స్‌లో ప్రతిభ చాటుకున్నట్లు కళాశాల ఎండీ రఘునాథ్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఔత్సాహిక ఇంజనీర్లలో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇండియా డిజైన్ వీక్ అనే కార్యక్రమాన్ని ఐసీపీ అకాడమీ, ఆటో డెస్క్ కంపెనీలు సంయుక్తంగా చెన్నైలో నిర్వహించాయన్నారు. ఇందులో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగానికి చెందిన బాల ఆదిత్య, మహమ్మద్ సోహెల్, విశ్వనాథ్, జగన్మోహన్ రెండు జట్లుగా పాల్గొని రోబోటిక్ హార్మ్ అనే అంశం ప్రదర్శించి బెస్ట్ డిజైన్ అవార్డు కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు కళాశాలలో వారిని ఎండీతోపాటు ప్రిన్సిపాల్ సుధాకర్, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్, మెకానికల్ విభాగఅధిపతి ఖయ్యాం అభినందించారు.

మరుగుదొడ్డి నిర్మాణానికి స్థలం కేటాయించండి

● లేకుంటే ఆత్మహత్య చేసుకుంటా
● గ్రీవెన్స్‌లో తహసీల్దార్ వద్ద ఓ వ్యక్తి ఆవేదన


పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ వద్ద రమేష్

యాడికి, ఏప్రిల్ 28(ఆంధ్ర జ్యోతి): వృద్ధులైన తన తల్లిదండ్రుల అవసరం కోసం మరుగుదొడ్డి నిర్మాణానికి స్థలం కేటాయించాలని, లేకుంటే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానని మండలంలోని కొట్టాలపల్లికి చెందిన రమేష్ అనేవ్యక్తి తహసీల్దార్ వద్ద ఆవేదన చెందాడు. ట్రాన్స్‌కో ఉద్యోగిగా పని చేస్తున్న రమేష్‌కు గ్రామంలో తన ఇంటిపక్కనే ఉన్న గ్రామ కంఠంలో మరుగుదొడ్డి నిర్మాణం విషయంలో గ్రామస్థుడికి వివాదం నెలకొంది. గత ఏడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు రమేష్ పురుగుల మందు డబ్బాతో వచ్చి సమస్యపై తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సమస్యను పరిష్కరించకుంటే పురుగుల మందు తాగి చస్తానని వాపోయాడు. గమనించిన రెవెన్యూ సిబ్బంది పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి ఇలా అధికారుల వద్ద ఇలాంటి వాటికి పాల్పడడం తగదని తహసీల్దార్ ఆయన్ను మందలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఇలా చేయడం తగదని హెచ్చరించి పంపారు. అనంతరం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి రమేష్ ఎటువంటి అఘాయిత్యానికి పాల్పడకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

రాయదుర్గం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఏఈఎస్ శ్రీరామ్ సోమవారం తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందితో కర్ణాటక మద్యం రవాణాను అరికట్టడంపై చర్చించారు. సీఐ మహేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

శెట్టూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కార్యక్రమానికి అధికశాతం అధికారులు డుమ్మా కొట్టారు. కేవలం తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టితో పాటు ఎంపీడీవో, వ్యవసాయాధికారి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫారెస్టు బీట్ ఆఫీసర్ మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చే ప్రజలు అధికారులు లేనిది చూసి నిరాశ పడ్డారు. జిల్లా అధికారులు స్పందించి అందరూ అధికారులు హాజరయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

చిన్నారుల మృతికి టీడీపీ నాయకుల నివాళి



ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకులు

శెట్టూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాటకల్లు గ్రామ సమీపంలో ఉన్న క్వారీ గుంతలో సోమవారం ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన చిన్నారులు జయంతి, దర్శినిల మృతదేహాలను టీడీపీ నాయకుడు అమరా రామ్మోహన్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గురుప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. తర్వాత చిన్నారుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే అమిలినేని సూచనల మేరకు ఆర్థికసాయం అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● ఎన్‌ఎంయూ నాయకుల డిమాండ్
● ఆర్టీసీ డిపోల వద్ద రిలే దీక్షలు


గుంతకల్లులో రిలే దీక్ష చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎన్‌ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని డిపో వద్ద సోమవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/2019ను వెంటనే అన్ని డిపోల్లోనూ అమలు చేయాలన్నారు. ఉద్యోగులు, కార్మికుల అక్రమ సస్పెన్షలు, తొలగింపులను ఆపాలన్నారు. గ్యారేజ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, 114జీఓలో పొందు పరచిన నైట్ ఔట్ అలవెన్సులను రూ.150 నుంచి రూ. 400లు చెల్లింపులు చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, డబుల్ డ్యూటీ అమౌంట్‌ను తక్షణమే పెంచాలని కోరారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ నగరాజ్, గ్యారేజ్ సెక్రటరీ ఎస్వీ రమణ, నాయకులు బాషా, వీఎల్ నరసింహులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

●ఉరవకొండ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్టీసీ ప్రాంగణంలో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ నారాయణస్వామి, నాయకులు వలి, బాలకృష్ణ, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

●గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూ నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి వెంకటరాముడు, నాయకులు బాలప్రసాద్, బాబు, రంగనాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

●రాయదుర్గం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఎన్‌ఎం యూ నాయకులు, కార్మికులు రిలేనిరాహారదీక్ష చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండురోజుల పాటు నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు పలువురు నాయకులు తెలిపారు. డిపో కార్యదర్శి తిప్పేస్వామి, ఎన్‌ఎంయూ జోనల్ సెక్రటరీ నాగరాజు, రీజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవినాయక్, రీజనల్ జాయింట్ సెక్రటరీ ఎం సిద్దేశులు, డిపో ప్రెసిడెంట్ టీఎస్‌కే జిలాన్, గ్యారేజ్ కార్యదర్శి సతీష్‌కుమార్, ట్రెజరర్ కేవై కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ రమేష్, కార్మికులు నాగరాజు, తిమ్మరాజు, గోపికృష్ణ, మైలారప్ప, చిన్నమల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

●తాడిపత్రి: ఎన్‌ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టినట్లు రీజనల్ సెక్రటరీ ప్రతాప్‌నారాయణ తెలిపారు. గ్యారేజీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. దీక్షలో సిబ్బంది బాబు, మోహన్, ఎంఆర్ఎస్ రెడ్డి, నాయుడు, రావ్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలి


యాడికిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

యాడికి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదల అభ్యున్నతికి అనునిత్యం కృషిచేస్తున్న ఆర్డీటీ కి ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం నిర్మూలించడానికి ఆర్డీటీ ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఇలాంటి స్వచ్ఛంద సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ కాకుండా చేయడం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవచూపి పునరుద్ధరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి నాగమునిరెడ్డి, టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, తెలుగుయువత నాయకుడు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

●రాయదుర్గం: ఆర్డీటీని అందరం చేయి చేయి కలిసి కాపాడుకుందామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ నిలిపివేయడం బాధాకరమన్నారు.వాటిని పునరుద్ధరించాలని జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు , ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, కులసంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సీనియర్ నాయకులు గో విందు, శిరిగేదొడ్డి తిప్పేస్వామి, కలుగోడు హనుమంతు, భీమరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

●బెళుగుప్ప: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ అయ్యేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు హనుమంతరాయుడు ప్రకటనలో కోరారు. ఇందుకు కేంద్రం వెంటనే స్పందించాలని అన్నారు.

● కుందుర్పి: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలంటూ ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని మండలకేంద్రంలో మహిళలు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ విషయంపై చర్చించేందుకు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలందరూ త్వరలోనే సీఎం చంద్రబాబును కలవనున్నట్లు చెప్పారు. తర్వాత వారు తహసీల్దార్ శ్రీనివాసులును కలిసి ఆయనకూ వినతిపత్రం అందజేశారు.

మహిళా ఉద్యోగిని దుర్భాషలాడిన వైసీపీ కాంట్రాక్టర్

● పోలీసులకు ఫిర్యాదు

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తాను అడి గిన ప్రకారం బిల్లు చేయలేదనే ఆక్రోశంతో వైసీపీకి చెందిన ఓ కాంట్రాక్టర్ ఓ మహిళా ఉద్యోగిని దుర్భాషలాడుతూ బెదిరించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకెళితే.. రాయదుర్గం మండలం ఆవులదట్ల గ్రామస్థుడైన నారాయణ నాయక్ వైసీపీకి చెందిన కాంట్రాక్టర్. ఆయన డీహీరేహాళ్ మండలంలోని తిమ్మలాపురం, పులకుర్తి తదితర గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. కాగా నాగలాపురం సచివాలయ పరిధిలోని తిమ్మలాపురంలో రూ. 8 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులకు సంబంధించి పులకుర్తి గ్రామ సచివాలయంలో ఇంజనీర్ అసిస్టెంట్‌ను మెజర్మెంట్ బుక్ రికార్డు చేసి బిల్లు చేయాల్సిందిగా పలుమార్లు ఒత్తిడి చేశారు. ఇందుకు తిమ్మలాపురానికి చెందిన ఇంజనీర్ అసిస్టెంట్ వేరే వాళ్లు ఉన్నారని, అది నా పరిధి కాదని, నాకు సంబంధం లేదని ఆ మహిళా ఉద్యోగి చెప్పారు. ఈ విషయమై సోమవారం ఆ కాంట్రాక్టర్ మహిళ ఉద్యోగికి మళ్లీ ఫోన్ చేసి నా పనులు ఎందుకు చేయవు, ఎట్టి పరిస్థితుల్లో చేయాల్సిందే అని గద్దిస్తూ నానా దుర్భాషలాడి అంతు చూస్తానని బెదిరించాడు. దీంతో ఆమె వెంటనే మండల కేంద్రంలోని పోలీసులకు ఈ మేరకు ఫిర్యాదు చేసింది. గతంలో కూడా పలుమార్లు తనను బెదిరించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా న్యాయవాదుల ర్యాలీ



గుంతకల్లులో గాంధీచౌక్ వద్ద నిరసన తెలుసుతున్న న్యాయవాదులు

గుంతకల్లు, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ గుంతకల్లు బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఉదయం స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో విధులను బహిష్కరించిన వారు అనంతరం కసాపురం రోడ్డు, మార్కెట్ రోడ్డు, మెయిన్ రోడ్డులలో ర్యాలీ చేశారు. తర్వాత గాంధీ చౌక్‌లో నిరసన తెలుపుతూ మాట్లాడారు. ఉగ్రదాడి పిరికి చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి ఉగ్రవాదాన్ని అణచివేయాలన్నారు. న్యాయవాదులు బీఎస్ కృష్ణారెడ్డి, యూనుస్ అహ్మర్, గోపాలకృష్ణ, శివరావు, సురేశ్ కుమార్, ఏజీపీ హేమాద్రి, రజబ్ వలి, నాగేషు, లక్ష్మీనారాయణ, పత్తికొండ నాగరాజు, చంద్రశేఖర్, తిమ్మప్ప, జీపీ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నిరసన

గుత్తి: ఉగ్రవాదుల దాడికి నిరసనగా పట్టణంలోని సీపీఎం నాయకులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ రాజీవ్ సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ వరకు సాగింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ.. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం దారుణమన్నారు. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం దాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. నాయకులు రామకృష్ణ, రేణుక, మల్లికార్జున, రేవతి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆపరేటర్ మృతి

విడపనకల్లు, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మహేష్(38) అనే వ్యక్తి గుండె పోటుతో సోమవారం ఉదయం మృతి చెందాడు. పాల్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇతను సోమవారం ఉదయం సబ్‌స్టేషన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు అంతలోనే కళ్లు తిరుగుతున్నాయంటూ అకస్మాత్తుగా కిందకు పడిపోయాడు. వెంటనే విడపనకల్లులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రాయదుర్గం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినయశ్రీ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఇందులో 2006లో పదో తరగతి చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తర్వాత అప్పటి ఉపాధ్యాయులు జనార్ధన్, ఎర్రిస్వామి, తిప్పేస్వామి, గౌరీశంకర్, వీరభద్ర, కిషోర్‌కుమార్, వందన, చంద్ర, వదన, నిర్మల, కళావతి, కృష్ణవేణిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పాఠశాల కరెస్పాండెంట్ మీనాకుమారి, నాగరాజు దంపతులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

తాడిపత్రి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికులందరూ విజయవంతం చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జుబేర్, కార్యదర్శి శ్రీరాములు పిలుపునిచ్చారు. పట్టణంలోని వాటర్ వర్క్స్ మాస్టర్ పాయింట్ వద్ద సోమవారం ఏపీ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం, ఇంజనీరింగ్ సెక్షన్ విభాగపు సమావేశం జరిగింది. ఇందులో వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి తెచ్చుకున్న 44చట్టాలను కేంద్రప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ బిల్లులుగా మార్చడం దుర్మార్గమన్నారు. కార్మికుల హక్కులకు రక్షణ లేకుండాపోయిందన్నారు. కేంద్రప్రభుత్వ వైఖరికి నిరసనగా మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, ఉమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగానహళ్లి గ్రామ శివారులోగల పేకాటకేంద్రంపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. అందులో పేకాటాడుతున్న పలువురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.3050 నగదును స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్కాబీటర్..

తాడిపత్రి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లి గ్రామానికి చెందిన ఓ మట్కా బీటర్‌ను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సామాచారం మేరకు సిబ్బందితో దాడులు చేసి మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేశామని, అలాగే అతనివద్ద నుంచి రూ.5వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

ఆర్డీటీ కాలనీలో ఇంటిపై దాడి

పట్టణంలోని ఆర్డీటీ కాలనీలో సుందరయ్య అనే వ్యక్తి ఇంటిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి టీవీ తదితర పరికరాలను ధ్వంసం చేశారు. ఆ ఇంటిపై దాడిచేయడానికి గల కారణాలు పూర్తిగా తెలియరాలేదు. పోలీసులను సమాచారం అడుగగా ఫిర్యాదు ఇంతవరకు రాలేదని, బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదుచేస్తామని తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

పుట్లూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామశివారులో సోమవారం అక్రమంగా మద్యం తీసుకువెళుతున్న వ్యక్తిని అరెస్ట్‌చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. సూరేపల్లికి చెందిన చంద్రప్ప అనే వ్యక్తి 15మద్యం బాటిళ్ల తీసుకువెళుతుండగా స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్తతరహాలో అన్యమత ప్రచారం

● మండిపడ్డ హిందూ చైతన్యవేదిక

తాడిపత్రి, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో కొత్తతరహాలో కొంతమంది అన్యమత ప్రచారకులు మత ప్రచారానికి తెరలేపారని హిందూ చైతన్య వేదిక నాయకులు మండిపడ్డారు. పట్టణ సమీపంలోని ఔటర్‌రింగ్‌రోడ్డు ఐశ్వర్యవిల్లాస్ వద్ద జాతీయ రహదారికి సంబంధించి సూచికల బోర్డులో క్రైస్తవ మతానికి సంబంధించి షాలెం చర్చికి దారి అని సూచించడంపై హిందూచైతన్య వేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అధికారులు వీటిపై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా అధికారులు మౌనంగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో చైతన్యవేదిక నాయకులు గంగాధర్‌యాదవ్, నారాయణస్వామి, హనుమంతరెడ్డి, శివారెడ్డి, నవీన్‌కుమార్, రాంనాథ్, పవన్, బాలాజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు..

తాడిపత్రి, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణాపురం జీరోరోడ్డులో ఉన్న సాధన కోచింగ్ సెంటర్‌లో గత పదిరోజులుగా నిర్వహిస్తున్న చేతిరాత శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. దీంతో అందులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసినట్లు కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు రాయుడు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై శ్రీవారి దర్శనం


అశ్వవాహనంపై ఉత్సవమూర్తులు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అశ్వవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలోని భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ చేసి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు జరిపారు. అనంతరం సాయంత్రం ఉత్సవ విగ్రహాలను అశ్వవాహనంపై కొలువుదీర్చి గోవిందనామ స్మరణతో పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

విద్యాభివృద్ధికి ముందుంటా: ఎమ్మెల్యే అమిలినేని


పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

శెట్టూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి తాను ముందు ఉంటానని, గ్రామాల్లో విద్యార్థుల చదువు కోసం ఎంతవరకు అయినా పాటు పడతానని ఎమ్మె ల్యే అమిలినేని సరేంద్రబాబు తెలిపారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు పాఠశాలకు రూ. 35 లక్షల నుంచి రూ. 40 లక్షల వ్యయంతో విద్యార్థులకు అత్యాధునికమైన డెస్కులు ఏర్పాటు చేయించి ఇస్తామని హామీ ఇచ్చారు. వేసవి సెలవులు ముగిసే సమయానికి అవి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

వైస్ చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవం


వైస్‌చైర్మన్లను సన్మానిస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

తాడిపత్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ల ఎన్నిక ప్రత్యేకాధికారి మల్లికార్జునుడు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా 18 మంది టీడీపీ, ఒక సీపీఐ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు మద్దతుగా నిలవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ముందుగా సభ్యుల చేత సంతకాలు చేయించుకొని ఏయే పార్టీకి ఎంతమంది మెజార్టీ అని స్పెషలాఫీసర్ పరిశీలించారు. ఎక్కువశాతం మంది టీడీపీ వైపు ఉన్నారు. వైసీపీ సభ్యులు కేవలం ఆరుగురే హాజరయ్యారు. మిగతా వారందరూ గైర్హాజరయ్యారు. దీంతో వైస్‌చైర్మన్-1గా 26వవార్డు కౌన్సిలర్ ఎల్లుట్ల షెక్షావలిని, వైస్‌చైర్మన్-2గా సీపీఐ కౌన్సిలర్ తలారి అరుణను ఎన్నిక చేశారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ వారిచేత ప్రమాణస్వీకారం చేయించి నియామక పత్రాలను అందజేశారు. తర్వాత వీరిని చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి , కౌన్సిలర్లు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలి

● అధికారులకు ఆర్డీవో వసంతబాబు సూచన

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో సమస్యల పరిష్కారం కోరుతూ పలువురు ప్రజల ఇచ్చిన అర్జీలను ఆర్డీఓ స్వీకరించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో వచ్చే ప్రతి సమస్యను అప్పటికప్పుడే పరిష్కరించే విధంగా డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. ఓ సమస్యపై ఎవరైనా అర్జీ ఇస్తే, మరలా ఆ సమస్యపై అర్జీ రాకుండా చూసే బాధ్యత ఆయాశాఖల అధికారులపైనే ఉందన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

మజ్జిగ పంపిణీ

బొమ్మనహాళ్, ఏప్రిల్ 28(ఆంధ్ర జ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ అధికారులు సోమవారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయని, ప్రతి సోమవారం రెవెన్యూ కార్యాలయానికి వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు కాసింత ఉపశమనం కల్పించేందుకు ఈ మజ్జిగ పంపిణీ చేపట్టామని తెలిపారు. దాదాపు 300 మందికి ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశామని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్, ఆర్ఐ బాలకిషన్, వీఆర్వో నాగరాజురావు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి: సీపీఐ

పామిడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం సీపీఐ కోరిన విధంగా పేదలకు 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు కూడా మంజూరు చేయాలన్నారు. అదేవిధంలో ఇక్కడ 1344 టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లిఫ్టులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వినతి పత్రాన్ని డీటీ లక్ష్మీకాంత్‌రెడ్డికి అందజేశారు. ఏపీ మహిళా సమైక్య నియోజకవర్గం నాయకురాలు సారాబీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఓంకార్, సీపీఐ కార్యదర్శులు చౌడప్ప, రాముడు, గఫూర్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

●కూడేరు: మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సూర్యప్రతాప్ యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి నారాయణమ్మ, నాయకులు రమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.